PRGI NO : TGTEL/26/A2002
EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 57 | పేజీలు : 8 | గురువారం 23 జూలై 2026 | వెల : 4/-






## విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారు

- ప్రతిపక్షాలపై రాజ్‌నాథ్ సింగ్ ఫైర్
- యువతను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారన్న రక్షణ మంత్రి
- యువతకు అన్యాయం జరగనివ్వబోమని రాజ్‌నాథ్ భరోసా
- విద్యార్థులు, యువత సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని హామీ
- చర్చ జరగాల్సిన వేదిక పార్లమెంటేనని వ్యాఖ్య
- ప్రతిపక్షాలు తమ అభిప్రాయాలను వీధుల్లో కాకుండా సభలో వెల్లడించాలని హితవు

## ఆరు వారాల గరిష్ఠానికి ముడి చమురు

- 95 డాలర్లు దాటిన బ్రెంట్ క్రూడ్
- అంతర్జాతీయ ఉద్రిక్తతలు, సరఫరా ఆందోళనలే కారణం
- ద్రవ్యోల్బణం, రవాణా ఖర్చులపై ప్రభావం చూపే అవకాశం
- ఒపెక్ దేశాల నిర్ణయాలపై ఆధారపడనున్న మార్కెట్ గమనం



## నీట్‌పై చర్చకు సిద్ధం



- రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవద్దు
- గతంలో కాంగ్రెస్, యూపీఏ హయాంలో ఎన్నో రాష్ట్రాల్లో పేపర్లు లీక్ జరిగాయన్న నడ్డా
- బెంగాల్, కర్ణాటకలోనూ ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని వ్యాఖ్య

# ప్రతి పేదవాడికి మంచి చేసేందుకు కృషి

- బీజేపీ, బీఆర్ఎస్‌లు చేసిన తప్పులను ప్రశ్నిస్తున్నందుకే తనపై కుట్ర
- ఓటరు జాబితాలో పేరు లేకపోతే ప్రభుత్వ పథకాలు రావు
- కొడంగల్‌లో 78 శాతం మాత్రమే ఎస్ఐఆర్‌లో నమోదు
- వచ్చే ఎన్నికల్లో ఓటు వేసే వారి జాబితా ఇప్పుడే నిర్ణయం అవుతోంది
- సర్‌పై కొడంగల్‌లో బీఎల్వోల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి
- బీజేపీ, బీఆర్ఎస్ వాళ్లు కలిసి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఓట్లు తొలగిస్తున్నారు.




హైదరాబాద్

బీజేపీ, బీఆర్ఎస్‌లు చేసిన తప్పులను ప్రశ్నిస్తున్నందుకే తనపై కుట్ర చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆ రెండు పార్టీలు వేరు కావొచ్చు కానీ, వాళ్ల లక్ష్యం మాత్రం ఒక్కటేనని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ఓటరు జాబితా సమగ్ర సవరణపై బీఎల్ఏలతో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు. ప్రతి పేదవాడికి మంచి చేసేందుకు కృషి చేస్తున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి, ఈక్రమంలో రోజుకు 18 గంటలు పనిచేసినా సమయం సరిపోవట్లేదన్నారు. కొడంగల్‌లో నేరుగా ఎదుర్కోలేక తనను దెబ్బతీసేందుకు కాంగ్రెస్‌కు ఓట్లు వేసిన వాళ్ల ఓట్లు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కొడంగల్‌లో దెబ్బతీస్తే రాష్ట్ర స్థాయికి రాలేడు అని ఆలోచిస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు 90 శాతం కాంగ్రెస్‌కు - మిగతా3లో

## అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందే

- గాంధీభవన్ ప్రజలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖాముఖి
- సమస్యలను నేరుగా మంత్రి దృష్టికి తీసుకొచ్చిన బాధితులు
- ఇందిరమ్మ ఇండ్ల కోసం మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సిందేనని స్పష్టం



హైదరాబాద్

హైదరాబాద్ క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రస్తుతం 16 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించిన మంత్రి గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు కూడా మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. మీ సేవ కేంద్రాలు, వాట్సాప్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. కొత్త - మిగతా3లో



### అదనపు ధాన్యం కొనుగోలు చేసేందుకు

# గ్రీన్‌సిగ్నల్

- రబీకి సంబంధించి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు
- మొత్తం 43 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు నిర్ణయం
- కేంద్రానికి కిషన్‌రెడ్డి, సంజయ్ కృతజ్ఞతలు

హైదరాబాద్

తెలంగాణ నుంచి మరింత ధాన్యం సేకరణకు కేంద్రప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నులు బియ్యం రూపంలో కొనుగోలు చేసేందుకు ఆమోదం తెలిపింది. సవరించిన వరి కొనుగోలు అంచనా ప్రకారం బియ్యం రూపంలో 43 లక్షల - మిగతా3లో

## కాంగ్రెస్ చలో లోక్‌భవన్

# ఉద్రిక్తత

- పీసీసీ చీఫ్, మంత్రుల అరెస్ట్
- రాహుల్‌గాంధీ, విపక్షనేతల అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ చలో లోక్‌భవన్
- నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు ర్యాలీ
- మంత్రులు, కాంగ్రెస్ నేతలను అరెస్టు చేసిన పోలీసులు



హైదరాబాద్

ఢిల్లీలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టును నిరసిస్తూ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "చలో లోక్‌భవన్" ర్యాలీ స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు చేపట్టిన ర్యాలీని లోక్‌భవన్ సమీపంలో పోలీసులు మధ్యలోనే అడ్డుకుని కాంగ్రెస్ ముఖ్య నాయకులను అదుపులోకి తీసుకున్నారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేసి లోక్‌భవన్ పరిసరాలను పూర్తిగా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఢిల్లీలో నిన్న రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతల అరెస్టుకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ నిరసన కార్యక్రమాలు చేపట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు - మిగతా3లో



## 10 ఏళ్లలో 152 పేపర్ లీక్‌లు.. ఒక్కరికీ శిక్ష లేదు

- 7.5 కోట్ల విద్యార్థులు ప్రభావితమయ్యారని వ్యాఖ్య
- ఒక్క కేసులోనూ శిక్ష పడలేదని విమర్శ
- విద్యార్థుల డిమాండ్లు సమంజసమేనంటూ మద్దతు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- ప్రధాని క్షమాపణ చెప్పాలని రాహుల్ పట్టు

నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
23 జూలై 2026

# 10 ఏళ్లలో 152 పేపర్ లీక్‌లు.. ఒక్కరికీ శిక్ష లేదు

**న్యూఢిల్లీ:** భారతదేశ విద్యా వ్యవస్థను మోదీ ప్రభుత్వం నాశనం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. విద్యార్థుల డిమాండ్లు పూర్తిగా చట్టబద్ధమైనవని, వాటిపై రాజీ పడటానికి ఆస్కారం లేదని తేల్చిచెప్పారు. విద్యార్థుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నీట్--యూజీలో అవకతవకలు జరిగాయని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ ధర్మేంద్ర ప్రధాన్ ఎందుకు రాజీనామా చేయడం లేదని నిలదీశారు. నిరసనకు దిగిన విద్యార్థులు ఉగ్రవాదులు కాదని.. వారు కేవలం నిష్పక్షపాతమైన విద్యా వ్యవస్థ కావాలని కోరుతున్నారని చెప్పారు. పరీక్షల్లో అక్రమాల వల్ల నష్టపోయిన వారికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాల్సిందేనని పేర్కొన్నారు. విద్యార్థులపై దాడికి బాధ్యులైన ప్రతి ఒక్కరినీ జవాబుదారీగా చేయాలన్నారు. రాహుల్ గాంధీ బుధవారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. దేశంలో విద్యా వ్యవస్థ రిగ్గింగ్‌కు గురైందని, అది సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం 'చలో సంసద్' నిరసన సందర్భంగా విద్యార్థులపై పోలీసుల దాడికి సంబంధించిన వీడియోను రాహుల్ ప్రదర్శించారు. ప్రభుత్వం, పాలకులు భయాందోళనలో ఉన్నారని, అందుకే విద్యార్థులను, ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ ఇంకా ఏం మాట్లాడారంటే..



**విద్యార్థుల డిమాండ్లు నెరవేర్చాలి..**

"ప్రధానమంత్రి నివాసం వద్ద మంగళవారం శాంతియుత నిరసనలో పాల్గొన్న నన్ను బలవంతంగా ఈడ్చేశారు. భౌతిక దాడి చేశారు, నిర్బంధించారు. అవన్నీ నేను లెక్కచేయను. అవి చాలా చిన్న విషయాలు. ప్రజల ఆకాంక్షలను వ్యక్తం చేయడమే నా పని. ఇప్పుడున్న విద్యా వ్యవస్థ వల్ల పేదలు ఇబ్బంది పడుతుండగా, ధనవంతులు పేపర్ లీక్‌లతో పరీక్షల్లో ఉత్తీర్ణులవుతున్నారు. ఈ పరిస్థితి కచ్చితంగా మారాలి. విద్యార్థులు లేవనెత్తిన మూడు డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. విద్యార్థులపై దాడి చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి.

**విద్య పేరిట దోచుకుంటున్నారు**

మన విద్యార్థులకు ఇలా ఎందుకు జరుగుతోంది అన్నదే ప్రశ్న. భద్రతా దళాలు వారిపై ఆయుధాలు గురిపెట్టడానికి, దాడి చేయడానికి విద్యార్థులు చేసిన తప్పేంటి? వారు ఈ దేశం తమకు ఇవ్వాల్సిన వాటిని కోరుతూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్నారు. న్యాయబద్ధమైన విద్యా వ్యవస్థ కావాలని అంటున్నారు. విద్యా వ్యవస్థలో లోపాల వల్ల పిల్లలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అంతులేని ఒత్తిడికి గురవుతున్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యా వ్యవస్థల్లో ఒకటిగా పేరుగాంచిన మన విద్యా వ్యవస్థ నేడు లోపాలమయంగా మారిన సంగతి అందరికీ తెలుసు. గత దశాబ్ద కాలంలో 152 సార్లు ప్రశ్నపత్రాల లీకేజీలు జరిగాయి. కానీ, ఒక్కరికి కూడా శిక్ష పడలేదు. విద్యా వ్యవస్థ వైఫల్యం కారణంగా 7.5 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారు. సమాజంలో ఒక వర్గం వ్యక్తులు మన విద్యా వ్యవస్థను, విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నారు. మన దేశంలో కుటుంబాలు విద్య కోసం చేసే వార్షిక వ్యయం రూ.1.32 లక్షల కోట్లు. ఇది రూ.1.4 లక్షల కోట్ల విద్యా బడ్జెట్‌కు దాదాపు సమానం. విద్య పేరిట కుటుంబాలను దోచుకుంటున్నారు. దేశంలో తయారీ రంగం మూతపడింది, పరిశ్రమల్లో అవకాశాలు లేవు, కార్పొరేట్ ఉద్యోగాలు లేవు. ఇక మిగిలిన ఏకైక మార్గం ప్రభుత్వ ఉద్యోగం మాత్రమే. అవి కూడా దక్కకుండా విద్యావ్యవస్థను ధ్వంసం చేశారు" అని రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు.

**జితేంద్ర సింగ్ గురించి చర్చ అనవసరం**

కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తనపై చేసిన వ్యాఖ్యలను రాహుల్ గాంధీ కొట్టిపారేశారు. జితేంద్ర సింగ్‌ను 'అప్రస్తుత వ్యక్తి'గా అభివరి?ణంచారు. నీట్--యూజీపై చర్చకు రాహుల్ తొలుత అంగీకరించి, తర్వాత మాట మార్చారని, ప్రధాని మోదీ రాజీనామా చేయాలంటూ పట్టుబట్టారని జితేంద్ర సింగ్ మంగళవారం ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై రాహుల్ బుధవారం స్పందించారు. "జితేంద్ర సింగ్ తనకు నచ్చిన ఎలాంటి విషయాన్నైనా ఊహించుకోవచ్చు. అలా ఊహించుకోవడానికి ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఉంది. దాని గురించి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు"అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి ఆరోపణల గురించి ఇప్పుడు మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. ఆయన గురించి చర్చ నిరర్థకమని పేర్కొన్నారు.

**పది రెట్లు దాడి చేసినా ఐ డోంట్ కేర్**

ప్రతి ప్రభుత్వంలోనూ నాయకత్వం మానసికంగా కుప్పకూలిపోయే సమయం వస్తుంది. ఇప్పుడు అదే జరిగింది. పోలీసులు నాతో ఎలా ప్రవర్తించారనేది నాకు అనవసరం. నేను పట్టించుకోను. నాతో ఐదు రెట్లు దారుణంగా ప్రవర్తించినా పట్టించుకోను. విద్యా వ్యవస్థపై, పత్రాల లీకేజీలను అరికట్టడంపై, పిల్లలకు చెల్లించాల్సిన ఖర్చులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. నా విషయంలో నచ్చింది చేసుకోండి. ఐదు రెట్లు కాదు కదా పది రెట్లు దాడి చేసినా ఐ డోంట్ కేర్. పోలీసులు నాతో ప్రవర్తించిన తీరువల్ల ఎన్నో విషయాలు నేర్చుకుంటాను. దెబ్బలు తినడం నాకు అలవాటే. అది సమస్యేమీ కాదు. ఇప్పుడంతా బాగానే ఉంది. ఒకటి రెండు దెబ్బలు తినడం పెద్ద విషయం కాదు. ఇంకా ఎన్నో దెబ్బలు తినడానికి సిద్ధంగా ఉన్నాను. పోలీసులు నన్ను ఈడ్చుకెళ్లి అక్కడి నుంచి తొలగించారు. అయితే, ఈ ప్రభుత్వాన్ని తొలగించమని నా చెవిలో చెప్పారు. ఆ భావన వారిలో ఉంది. జరిగిన దానిపై పోలీసులు కూడా సంతోషంగా లేరు. విద్యార్థులపై దాడి చేయడం దేశ భవిష్యత్తుకు వ్యతిరేకమైన నేరమని వివేకవంతులైన కొందరు పోలీసు సిబ్బంది భావిస్తున్నారు. నిరసనకారుల్లో తమ పిల్లలను చూసుకుంటున్నారు.

# సిట్ నివేదిక తర్వాతే సీఈవో నియామకం

అయోధ్య రామమందిర ధార్మిక వ్యవహారాలను పర్యవేక్షించేందుకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ 9 మందితో కూడిన ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో అయోధ్యకు చెందిన ఐదుగురు సాధువులు, వేరే ప్రాంతాల నుంచి నలుగురు సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు అయోధ్య రామాలయం విరాళాల చోరీ వ్యవహారం తర్వాత రెండోసారి సమావేశమైన ట్రస్ట్ సభ్యులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రామాలయంలో అర్చకత్వం నిర్వహించే పూజారుల కోసం ఓ శాశ్వత శిక్షణ సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ట్రస్టు కోశాధికారి గోవింద్ దేవ్ గిరి వెల్లడించారు. ఈ సంస్థలో శిక్షణ పూర్తి చేసుకున్న అర్చకులకు ట్రస్ట్ ద్వారా ధ్రువపత్రాలను అందజేస్తామని తెలిపారు. ట్రస్ట్ సీఈవో పదవికి దేశవ్యాప్తంగా 5 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించేందుకు నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుత పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా ఓ అంతర్గత కార్యదర్శిని నియమించాలని సమావేశంలో నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. రామాలయ విరాళాల దుర్వినియోగానికి సంబంధించి సిట్ తుది నివేదిక ఇంకా తమకు అందలేదన్న గోవింద్ దేవ్ గిరి సిట్ నివేదిక తర్వాతే సీఈవో నియామకంపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలోనే, శ్రావణమాసంలో వచ్చే భక్తుల కోసం చేయాల్సిన ఏర్పాట్లు, ఖాళీగా ఉన్న ధర్మకర్తల పదవుల భర్తీ సహా, పలు పరిపాలనా, ఆర్థిక సమస్యలను కూడా సమీక్షించారు. ఈ సమావేశం తర్వాత ట్రస్ట్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి కృష్ణమోహన్?, కోశాధికారి గోవింద్? దేవ్? గిరి విలేకరులతో మాట్లాడారు. "రామ మందిరానికి సంబంధించిన అన్ని మతపరమైన వ్యవహారాలను పర్యవేక్షించడానికి ఒక శాశ్వత మత కమిటీని ఏర్పాటు చేయాలని ట్రస్ట్ నిర్ణయించింది. ఈ కమిటీలో 9 మంది సాధువులు ఉంటారు. వీరిలో ఐదుగురు అయోధ్యకు



చెందినవారు కాగా, నలుగురు బయటివారు ఉంటారు" అని గోవింద్ దేవ్ గిరి తెలిపారు.

**వైష్ణవ-రామానంది నిబంధనల అమలు!**

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యుడు, నిర్మోహి అఖాఢా అధిపతి దినేంద్ర దాస్ బుధవారం కీలక వ్యాఖ్యలు చేశారు. ఆలయ ట్రస్ట్‌లో ఖాళీగా ఉన్న మూడు స్థానాల్లో ఒక దానికి దివంగత ట్రస్టీ బిమ్లేంద్ర మోహన్ ప్రతాప్? మిశ్రా కుమారుడిని నియమించాలని కోరారు. దీనితోపాటు ఆలయ పూజా విధానాలు, ఆచారాలు కచ్చితంగా వైష్ణవ-రామానంది సంప్రదాయం ప్రకారమే జరగాలని తాను ట్రస్ట్ ముందు ప్రతిపాదించినట్లు తెలిపారు. వైష్ణవ సంప్రదాయంలోని ఈ విధానం ప్రకారం, శ్రీరాముడిని సర్వోన్నత దేవుడిగా పూజిస్తారు. ఈ సంప్రదాయం సంత్ రామానంద కాలం నుంచి వస్తోంది. అయోధ్యలోని మిగిలిన ఆలయాల తరహాలోనే ఈ రామాలయంలో కూడా రోజువారీ పూజలు, ఇతర కార్యక్రమాలు ఈ వైష్ణవ-రామానంది సంప్రదాయం ప్రకారమే జరుగుతాయి. అయితే దక్షిణ భారతదేశంలో అనుసరించే రామానుజాచార్య సంప్రదాయం ఇక్కడకు తీసుకురావడంపై కొన్ని వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

మరోవైపు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌ను తిరిగి ట్రస్టులోకి తీసుకువచ్చే విషయమై ఏమైనా చర్చ జరిగిందా? అని విలేకరులు ప్రశ్నించగా, ఆ విషయంపై తనకు ఎలాంటి సమాచారం లేదని దినేంద్ర దాస్? చెప్పారు. అయితే ట్రస్ట్ తీసుకున్న ఏ నిర్ణయమైనా అందరికీ ఆమోదయోగ్యమేనని అన్నారు. అలాగే అయోధ్య రామమందిర విరాళా దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో ప్రారంభించిన శుద్ధీకరణ ప్రక్రియ అనేది ఒక ఆచారమని, ఇది మరో రెండు మూడు రోజులపాటు కొనసాగుతుందని దాస్? చెప్పారు. "ప్రాయశ్చిత్తంగా చేస్తున్న ఈ శుద్ధీకరణ ఆచారం ఇప్పటికే సానుకూల ఫలితాలను ఇస్తోంది. మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి" అని చెప్పారు.

# నీట్‌పై చర్చకు విపక్షాలు పట్టు

నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ వివాదం, నిరసనకారులపై పోలీసుల చర్య, ప్రతిపక్ష నాయకుల నిర్బంధం పార్లమెంట్ లో మరోసారి తీవ్ర దుమారం రేపింది. ఈ అంశాలపై రాజ్యసభలో రూల్ 267 కింద అన్ని కార్యక్రమాలను నిలిపివేసి తక్షణ చర్చ చేపట్టాలని విపక్షాలు పట్టుబట్టాయి. అయితే ప్రభుత్వం అందుకు అంగీకరించకపోవడంతో సభలో ప్రతిష్టంభన కొనసాగుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు జైరాం రమేశ్ ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత నేతృత్వంలో పలువురు విపక్ష పార్టీల సభ్యులు రూల్ 267 కింద నోటీసు సమర్పించినట్లు జైరాం రమేశ్ తెలిపారు. జులై 20న విద్యార్థుల శాంతియుత నిరసనల సందర్భంగా పోలీసులు అధిక బలప్రయోగానికి పాల్పడ్డారనే ఆరోపణలపై చర్చ జరపాలని వారు కోరినట్లు చెప్పారు. నీట్ అంశంపై రూల్ 267 కింద చర్చ నిర్వహించేందుకు ప్రభుత్వం నిరాకరించడమే రాజ్యసభలో ప్రతిష్టంభనకు ప్రధాన కారణమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి ఈ అంశంపై మౌనం వీడాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌పై కూడా చర్చ జరగాలని విపక్షం కోరుతోందన్నారు. అయితే రాజ్యసభలో రూల్ 267 ప్రకారం సభలో ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలను నిలిపివేసి అత్యవసర ప్రజా ప్రయోజన అంశంపై వెంటనే చర్చ చేపట్టే అవకాశం ఉంటుంది. అయితే రూల్ 176 కింద స్వల్పకాలిక చర్చ మాత్రమే నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో రూల్ 267 కిందే చర్చ జరగాలని విపక్షం పట్టుబడుతుండగా, ప్రభుత్వం మాత్రం సభా నిబంధనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని చెబుతోంది. లాఠీచార్జ్, టియర్ గ్యాస్, పెల్లెట్ గన్స్, షాక్ బ్యాటన్లు, వాటర్ క్యానన్ల వినియోగంపై సభలో సమగ్ర చర్చ జరగాలని విపక్షం డిమాండ్ చేసింది. అలాగే జులై 21న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇతర విపక్ష నేతలను అదుపులోకి తీసుకున్న ఘటనపైనా వివరణ కోరింది. కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ నీట్-సీబీఎస్ఈ పరీక్షల లీకేజీ అంశంపై వాయిదా తీర్మానం ద్వారా చర్చ జరగాలని అన్ని విపక్ష పార్టీలు ఏకగ్రీవంగా నిర్ణయించాయని తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పాటు భవిష్యత్తులో ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేందుకు సమగ్ర కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం చర్చకు దూరంగా పారిపోతోందని విమర్శించారు. సభ పదేపదే వాయిదా పడుతోందని, రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసనలకు తమ పార్టీ పూర్తి మద్దతు ఇచ్చిందని చెప్పారు.

చర్చకు సిద్ధమే: కేంద్రం

మరోవైపు ప్రభుత్వం మాత్రం నీట్? అంశంపై చర్చ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. గత మూడు రోజులుగా చర్చకు సిద్ధమని అధికారికంగా తెలియజేస్తున్నామని చెప్పారు. అయితే ఏ నిబంధన కింద చర్చ జరపాలన్న అంశాన్ని అన్ని పార్టీల ఫ్లోర్? లీడర్లు కలిసి నిర్ణయించాలని సూచించారు. దేశ యువతకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశమైనందున ఫలవంతమైన చర్చ జరగాలని ప్రభుత్వం కోరుకుంటోందన్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజల ముందుకు తీసుకురావడానికి కూడా ఈ చర్చ ఉపయోగపడుతుందని వివరించారు.

## నీట్‌పై చర్చకు సిద్ధం



నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పేపర్ లీక్‌తో సంబంధమున్న అన్ని అంశాలపై సమగ్ర చర్చకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. విపక్షాలు అడిగే ప్రశ్నలకు పార్లమెంటులో సమాధానాలు ఇస్తామన్నారు. అయితే, విపక్షాలు చీటికిమాటికి గోల్‌పోస్టు మారుస్తున్నాయని, విద్యార్థుల భవిష్యత్ గురించి తమకు పూర్తి బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు.

గతంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పేపర్లు లీక్ అయ్యాయని, యూపీఏ హయాంలో ఎన్నో రాష్ట్రాల్లో పేపర్లు లీక్ జరిగాయని నడ్డా వ్యాఖ్యానించారు. విద్యార్థుల అంశాన్ని రాజకీయంగా వాడుకోవటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కొన్ని అంశాలనే టార్గెట్‌గా చేసుకుని రాహుల్‌గాంధీ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో పేపర్లు లీక్ జరిగిందని, తెలంగాణలో ఇంటర్ పేపర్, కేరళ, తమిళనాడులో పేపర్లు లీక్ అయ్యాయని తెలిపారు. బంగాల్, కర్ణాటకలోనూ ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని పేర్కొన్నారు. కానీ, బీజేపీ ప్రభుత్వం మాత్రం బాధ్యయుతంగా వ్యవహరిస్తోందని తెలిపారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘటనపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న నిరసనల నేపథ్యంలో నడ్డా దిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాకు వివరాలు తెలియజేశారు.

**పేపర్ లీక్ ఆందోళనకారులకు రాజ్‌నాథ్ సింగ్ హామీ**

విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం చూసుకుంటుందని నీట్ పేపర్ లీక్ ఆందోళనకారులకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను విపక్షాలు కీలుబొమ్మలుగా చేసుకున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యార్థులు, యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు.

ం"దిల్లీలో జరుగుతున్న నిరసనలు తీవ్ర ఆందోళన కలిగించే విషయం. కొందరు వ్యక్తులు తమ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి మన దేశ విద్యార్థులను, యువతను రాజకీయ సాధనాలుగా వాడుకోవడానికి ప్రయత్నించడం అత్యంత దురదృష్టకరం. మోదీ నాయకత్వంలో విద్యార్థులు, యువత ఆకాంక్షలను నెరవేర్చడానికి, అలాగే వారి సంక్షేమం కోసం మా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. విద్యార్థుల ప్రతి ఆందోళనను ఆలకించి, వాటిని పరిష్కరించడం మా బాధ్యత. అటువంటి మోసపూరిత ప్రయత్నాలను భారతదేశపు చైతన్యవంతమైన, తెలివైన యువత పూర్తిగా అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా. వారు పురోగతి, అభివృద్ధి, దేశ నిర్మాణ మార్గాన్ని ఎంచుకుంటారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

**యువతను తప్పుదోవ పట్టించడానికి విఫల ప్రయత్నాలు**

కొందరు ప్రతిపక్ష నాయకులు విద్యార్థుల్లో కోపావేశాలను సృష్టిస్తున్నారని రాజ్?నాథ్? ఆందోళన వ్యక్తం చేశారు. యువతను తప్పుదోవ పట్టించడానికి విఫల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటులో కాకుండా వీధుల్లో సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రతిపక్షం అనుచితమైన ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య సమస్యలను చర్చించడానికి సరైన వేదిక పార్లమెంట్ భవనమని, అక్కడ ప్రతిపక్షానికి తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వెల్లడించే పూర్తి స్వేచ్ఛ ఉందని తెలిపారు. తమ ప్రభుత్వం కూడా యువత భావాలు, ఆందోళనలను వినడానికి సిద్ధంగా ఉందని, ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రతి అంశంపై అర్థవంతమైన చర్చ జరగాలని ప్రభుత్వం కూడా చెప్పిందన్నారు. సభ సజావుగా పనిచేసేందుకు ప్రతిపక్షాలు అనుమతించాలని కోరుతూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఇదిలా ఉండగా, బుధవారం ఉదయం, ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. ఈ నిరసనలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్? యాదవ్, కాంగ్రెస్? ఎంపీ ప్రియాంక గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారు

నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై దేశ రాజధానిలో విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న వేళ కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విద్యార్థులు, యువతను రాజకీయ ప్రయోజనాల కోసం సాధనంగా ఉపయోగించేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం విద్యార్థులు, యువత సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. విద్యార్థుల ప్రతి ఆందోళనను విని పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. ప్రతిపక్ష నేతలు సృష్టిస్తున్న ఆగ్రహ వాతావరణం ప్రజలను, ముఖ్యంగా యువతను తప్పుదోవ పట్టించే విఫలయత్నమేనని విమర్శించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ అంశంపై చర్చకు ప్రభుత్వం మొదటి నుంచే సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇలాంటి అంశాలపై చర్చ జరగాల్సిన వేదిక పార్లమెంటేనని, వీధుల్లో కాకుండా సభలోనే ప్రతిపక్షాలు తమ అభిప్రాయాలను వెల్లడించాలని సూచించారు. పార్లమెంట్ సజావుగా నడిచేలా ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు. నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్, విద్యార్థుల ఆందోళనలపై చర్చ చేపట్టాలంటూ ఇండియా కూటమి సభ్యులు పార్లమెంట్ ఉభయ సభల్లో నిరసన వ్యక్తం చేశారు. దీంతో లోక్‌సభ పలుమార్లు వాయిదా పడగా, రాజ్యసభ కూడా అంతరాయానికి గురైంది. అయితే ఈ అంశంపై చర్చకు ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మరోసారి స్పష్టం చేశారు.

## ఆరు వారాల గరిష్ఠానికి ముడి చమురు



అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మరోసారి భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర గత ఆరు వారాల్లో తొలిసారిగా బ్యారెల్‌కు 95 డాలర్ల మార్కును అధిగమించింది. ప్రపంచ ఇంధన మార్కెట్లో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా సంబంధిత ఆందోళనలు, మారుతున్న డిమాండ్ పరిస్థితులే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిణామాలు, ప్రధాన చమురు ఉత్పత్తి దేశాలు ఉత్పత్తిలో సర్దుబాట్లు చేయడం వంటివి ధరల పెరుగుదలకు దారితీశాయి. ఇది చమురు మార్కెట్లలో మళ్లీ అస్థిరతను సూచిస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇరాన్ మిలిటరీ స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు కొనసాగిస్తుండటంతో, ప్రతిగా ఇరాన్ కూడా బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులకు పాల్పడుతోంది. దీనికి తోడు యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు సౌదీకి సంబంధించిన నౌకలను దిగ్బంధనం చేస్తామని హెచ్చరించడంతో, ఆయిల్ ట్యాంకర్లు తమ రవాణా మార్గాలను మార్చుకుంటున్నాయి. ముడి చమురు ధరల పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం, రవాణా ఖర్చులపై నేరుగా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇంధనం దిగుమతులపై ఆధారపడిన దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఇది సవాలుగా మారనుంది. ఈ నేపథ్యంలో వివిధ దేశాలు ప్రభుత్వాలు, పారిశ్రామిక వర్గాలు మార్కెట్ కదలికలను నిశితంగా గమనిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఒపెక్ దేశాలు తీసుకోబోయే నిర్ణయాలు, అంతర్జాతీయ ఆర్థిక సంకేతాలపై చమురు ధరల గమనం ఆధారపడి ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# కాంగ్రెస్ చలో లోక్‌భవన్ ఉద్రిక్తత

-మొదటిపేజీ తరువాయి

నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు సంకెళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ర్యాలీని దృష్టిలో ఉంచుకుని నెక్లెస్ రోడ్డు నుంచి లోక్‌భవన్ వరకు పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో మొదలైన ర్యాలీని లోక్‌భవన్ సమీపంలో ప్రధాన కూడలి వద్దే పోలీసులు అడ్డుకున్నారు. ముందే మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు ర్యాలీని నిలిపివేశారు. పోలీసుల అడ్డుకట్టను దాటేందుకు కొందరు కార్యకర్తలు ప్రయత్నించడంతో స్వల్పంగా ఉద్రిక్తత నెలకొంది. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అప్పటికే మోహరించిన పోలీసు బలగాలకు అదనంగా పంజాగుట్ట పోలీసు స్టేషన్ నుంచి సిబ్బందిని, మహిళా కానిస్టేబుళ్లను రప్పించి భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఇదే సమయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబీర్ అలీ సహా పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులను నాంపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. మిగిలిన నాయకులను పంజా గుట్ట పోలీసు స్టేషన్‌కు తరలించారు. కొద్దిసేపటి తరువాత వీళ్లను పోలీసులు విడుదల చేశారు. "రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం, మహిళ అని చూడకుండా



ప్రియాంక గాంధీని తోపులాటతో అరెస్టు చేశారు. పోలీసులు ప్రజాస్వామ్యం మంటగలిసే విధంగా వ్యవహరించారు. మోదీ నీట్ పరీక్షలు సక్రమంగా నిర్వహించ లేకపోయారు. ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పటివరకు రాజీనామా చేయలేదు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారు. పోలీసులతో రాజ్యాంగాన్ని నడుపుతామంటే భారతదేశంలో కుదరదు" – మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ అధ్యక్షుడు

### కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి నిరసన

దిల్లీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టును వ్యతిరేకిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిరసన తెలిపారు. కొడంగల్‌లో తననివాసం నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న కార్యకర్తలు, కొడంగల్ ప్రజలు పాల్గొన్నారు.

### హనుమకొండలో నిరసన

ఏఐసీసీ పిలుపు మేరకు హనుమకొండలో చేపట్టిన నిరసనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖ పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

### ఖమ్మంలో భారీ ర్యాలీ

రాహుల్‌గాంధీ అరెస్టును వ్యతిరేకిస్తూ ఖమ్మంలో కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీ చేపట్టారు. ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయం నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ చేశారు. ర్యాలీలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# అదనపు ధాన్యం కొనుగోలు చేసేందుకు గ్రీన్‌సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి

మెట్రిక్ టన్నుల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయిం చింది. తెలంగాణలో వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ సిస్టమ్‌ను (వీఎల్‌టీఎస్) 2026 సెప్టెంబర్ 30వ తేదీలోపు పూర్తిగా అమలు చేయాలని స్పష్టంచేసింది. పార్లమెంటులో కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావే శమైన కేంద్రమంత్రి బండి సంజయ్ అదనంగా ధాన్యం కొనుగోలుకు అనుమతించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

### ప్రహ్లాద్ జోషికి కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు

తెలంగాణ రాష్ట్రం నుంచి బియ్యం సేకరణను మరో 8 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల కేంద్రమంత్రి కిషన్?రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రైతుల మేలు కోసం బీజేపీ ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకోవడం సంతోషకరం అన్నారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2025–26కు సంబంధించి సీజన్ ప్రారంభానికి ముందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమక్షంలో తెలంగాణ నుంచి 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించాలని సంయుక్తంగా నిర్ణయించారన్నారు. తెలంగాణలో ఈసారి ధాన్యం ఉత్పత్తిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కలిసి జూలై 8న కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశమయ్యారు. 'తెలంగాణ నుంచి



బియ్యం సేకరణ పరిమాణాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశాం. మా విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం, బియ్యం సేకరణ లక్ష్యాన్ని 35 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రైతుల పరిస్థితులను అర్థం చేసుకుని బియ్యం సేకరణ పెంపు నిర్ణయం తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక కృతజ్ఞతలు. అలాగే మా విజ్ఞప్తికి వెంటనే స్పందించి సానుకూల నిర్ణయం తీసుకునేలా సహకరించిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు' అని కిషన్?రెడ్డి తెలిపారు.

# అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందే

-మొదటిపేజీ తరువాయి

దరఖాస్తులతోపాటు పాత దరఖాస్తులను కూడా సమగ్రంగా పరిశీలించి అర్హులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. యాప్‌లో వస్తున్న చిన్న, చిన్న సమస్యలను సరిదిద్దుతామని ప్రకటించారు. గాంధీభవన్‌లో నిర్వహించిన ప్రజలతో ముఖా ముఖి కార్యక్రమంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని, ఇప్పుడు ప్రతి వారం గాంధీ భవన్‌లో మంత్రులు నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీక రిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



### సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

భూములు, ఇండ్లు, రెవెన్యూ, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలను బాధితులు నేరుగా మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే జిల్లా కలెక్టర్లకు ఫోన్ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వంలో మంత్రులు ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదని, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం ఉండేది కాదని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి వారం ఒక మంత్రి గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తూ నేరుగా సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### ఇంటి స్థలంలో వాటా హక్కు

గత ప్రభుత్వ నగరాలకు 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఇండ్లు నిర్మించడం వల్ల ఉపాధి అవకాశాలు దూరమవుతాయనే కారణంతో చాలా మంది పేదలు ఆ ఇళ్లలో నివసించలేదని పొంగులేటి ఆరోపించారు. అలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా పేదలు పుట్టి పెరిగిన ప్రాంతంలోనే నివాసం కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ టవర్లలో నిర్మించే ఫ్లాట్ల విలువ రూ.40 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఉంటుందని, లబ్ధిదారులకు ఇంటి స్థలంలో వాటా హక్కు కూడా కల్పిస్తామని వివరించారు.

## ప్రతి పేదవాడికి మంచి చేసేందుకు కృషి

-మొదటిపేజీ తరువాయి

ఓట్లు వేస్తారని, వారి ఓట్లు తొలగిద్దామని చూస్తున్నారని ఆరోపించారు. కొడంగల్‌లో 78 శాతం మంది సర్? ప్రక్రియలో పాల్గొన్నారని తెలిపారు. మిగిలిన 22 శాతం ఓట్లు నమోదు చేయించాలని అధికారులకు సూచించారు.

"సర్‌లో కేవలం మైనార్టీల ఓట్లే తొలగిస్తున్నారనే ఒక అపోహ ఉంది. బీజేపీ, బీఆర్ఎస్ వాళ్లు కలిసి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఓట్లు తొలగిస్తున్నారు. ఎందుకంటే ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు 90 శాతం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తరు, లెక్క గట్టి గంప గుత్తగా తీసి ఈ ఓట్లను బయట పడేసి రేవంత్ రెడ్డి సంగతి చెప్పొచ్చని అనుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయాలని బీజేపీ, బీఆర్ఎస్?లు ఒక్కటై పేదల ఓట్లు తొలగించే ప్రయత్నం చేస్తున్నాయి. ఎందుకంటే ఇక్కడ బీజేపీ ఉన్నది లేదు, ఊడేది లేదు. బీజేపీ, బీఆర్?ఎస్? ఒక్కటై మనతో కొట్లాడలని వాళ్ల కుట్ర. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్?ఎస్? వాళ్లే బీజేపీకి ఓట్లు వేయించారు. వీటిన్నింటిని తిప్పి కొట్టాలంటే గ్రామంలో ఉన్న వారి వల్లనే అవుతుంది" –రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

### ఆధారాలు చూపి నమోదు చేసుకోండి

ఓటర్లతో బీఎల్‌ఏలు ఎస్ఐఆర్ తప్పకుండా నమోదు చేయించాలన్న సీఎం, ఓటరు జాబితాలో పేరు లేకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు రావని చెప్పారు. గతంతో పోలిస్తే సరైన వివరాలు లేకపోతే పక్కన పెడతారన్న ఆయన అనుమానాస్పదంగా ఉంటే సరైన ఆధారాలు చూపి ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో ఓటు వేసే వారి జాబితా ఇప్పుడే నిర్ణయం అవుతోందని, కొడంగల్ నియోజకవర్గంలో అర్హులైన వారి ఓట్లు తొలగించేందుకు వీల్లేదని తేల్చి చెప్పారు. ఈనెలాఖరు నాటికి కొడంగల్‌లో 100 శాతం సర్? ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. తనపై కుట్రలు చేసేవాళ్లను మీరే దెబ్బకొట్టాలని రేవంత్?రెడ్డి ప్రజలను కోరారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ నేతలు, బీఎల్‌ఏలూ ఈ సమావేశానికి హాజరయ్యారు.

### కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టుకు కొడంగల్‌లో సీఎం నిరసన

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. దిల్లీలో మంగళవారం రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీని అరెస్ట్ చేయడంతో నిరసనగా వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో కాంగ్రెస్ శ్రేణులు, నాయకులతో కలిసి సీఎం ధర్నా చేపట్టారు. కొడంగల్‌లోని తన నివాసం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. నీట్ ప్రశ్నాపత్రాలను పల్లీ బఠానీల్లా కోట్ల రూపాయలకు అమ్ముకుని లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులపై దిల్లీ పోలీసులు లాఠీఛార్జులు, టీయర్?గ్యాస్ ప్రయోగం, పాశవిక దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ రక్తం కళ్ల జూసిన కేంద్ర ప్రభుత్వాన్ని వదిలి పెట్టేది లేదని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

"విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని దేశం నలుమూలల నుంచి యువకులు దిల్లీ జంతర్ మంతర్‌లో కదం తొక్కి డిమాండ్ చేశారు. నీట్, సీబీఎస్ఈ ప్రశ్నపత్రాల లీక్‌ల గురించి చర్చ జరగకుండా అడ్డుకున్నాడు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులపై దిల్లీ పోలీసులు లాఠీఛార్జులు, బాష్పవాయువుతో పాశవిక దాడి చేశారు. రాహుల్‌గాంధీ రక్తం కళ్ల జూసిన కేంద్ర ప్రభుత్వాన్ని వదిలి పెట్టేది లేదు"

## కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ - నాంపల్లి రోడ్‌లో హైటెన్షన్

**గాంధీభవన్ ముట్టడికి యత్నించిన బీజేపీ నేతలు**

**ఉద్రిక్తతల నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అరెస్టు**

**పోటీగా బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నించిన కాంగ్రెస్ నేతలు**

**ఉద్రిక్తత, పలువురి అరెస్టు**



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం వద్ద రాహుల్ గాంధీ నేతృత్వంలో ధర్నా చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ గాంధీ భవన్ ముట్టడికి యత్నించింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు నేతృత్వంలో పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి గాంధీ భవన్ భవన్ ముట్టడికి బయల్దేరిన కాషాయ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం సమీపంలో బారికేడ్లు వేసి బీజేపీ నేతలను నిలువరించారు. దీంతో బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కాషాయ శ్రేణులకు పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుతో పాటు కాషాయ శ్రేణులను అరెస్ట్ చేసి గోషామహల్ పోలీస్ స్టేషన్?కు తరలించారు. మరోవైపు బీజేపీ యువ మోర్చా కార్యకర్తలు గాంధీ భవన్ వద్ద ఉన్న కాంగ్రెస్ ఫ్లెక్సీలను చించివేశారు. లోక్ భవన్?ను ముట్టడించే నైతిక హక్కు కాంగ్రెస్?కు లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. రాహుల్ గాంధీ వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధం అన్నారు. ప్రతిపక్ష నేతగా చర్చకు రమ్మంటే పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు విదేశీ శక్తులు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. విదేశీ కుట్రలకు రాహుల్ గాంధీ వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు.

### బీజేపీ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు యత్నం

బీజేపీ నేతలు గాంధీభవన్ ముట్టడిని నిరసిస్తూ పోటీగా బీజేపీ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు యత్నించాయి. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్? నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు బీజేపీ ఆఫీస్ ముట్టడికి యత్నంచడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలోనే బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు పరస్పరం ఒకరిపైకి ఒకరు కర్రలు, రాళ్లు రువ్వుకున్నారు. ఈ దాడిలో ఓ మహిళా కానిస్టేబుల్ కాలికి గాయమైంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు యువజన కాంగ్రెస్, ఎన్?ఎస్?యూఐ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల ముట్టడులతో భారీగా ట్రాఫిక్ జామ్? ఏర్పడింది. నాంపల్లి నుంచి ఎంజీబీఎస్? వెళ్లే మార్గంలో వాహనాల ప్రయాణాలకు అంతరాయం ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## తెలంగాణలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలు, అవకతవకలకు నిరసనగా జులై 24న తెలంగాణ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐపీఎస్‌యూ సంఘాలు ఈ బంద్‌లో పాల్గొంటున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు బంద్ వివరాలను వెల్లడించారు. వరుస పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశ విద్యా వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని రద్దు చేయాలని, విద్యా వ్యవస్థ స్వయంప్రతిపత్తికి భంగం కలిగిస్తోందని ఆరోపిస్తున్న వీవీబీఎస్‌ఏ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులు, యువతపై జరిగిన పోలీసుల దాడిపై పారదర్శక విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జులై 24న జరిగే విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యాలు, తల్లిదండ్రులు, మేధావులు సంపూర్ణ మద్దతు తెలిపి విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల ఐక్యవేదిక విజ్ఞప్తి చేసింది.

## సంపాదకీయం

# విభజన చట్టం ప్రకారం సీట్లు పెంచాల్సిందే!

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించే డీలిమిటేషన్ చట్టం అమల్లోకి వస్తే కేవలం లోక్‌సభ స్థానాలే పెరుగుతాయా లేక రాష్ట్రాల శాసనసభ సీట్లు కూడా పెరుగుతాయా? అనేది ఇప్పుడు తెలుగు రాష్ట్రాల పొలిటికల్ సర్కిళ్లలో అత్యంత ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది. డీలిమిటేషన్ అనేది నియోజకవర్గాల పునర్విభజన. జనాభా మార్పులకు అనుగుణంగా అసెంబ్లీ, లోక్‌సభ సీట్ల సంఖ్య, సరిహద్దులను మార్చడం. దీని ద్వారా అన్ని నియోజకవర్గాల్లో జనాభా దాదాపు సమానంగా ఉంటారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ సీట్లు కూడా జనాభా నిష్పత్తి ప్రకారం సర్దుబాటు చేస్తారు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలన్నీ.. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఉన్నాయి. కానీ తెలుగు రాష్ట్రాల్లో విభజన సమయంలోనే సీట్ల పెంపు హామీ ఇచ్చారు. డీలిమిటేషన్ అనగానే చాలామంది కేవలం ఎంపీ సీట్ల పెంపు గురించే చర్చిస్తున్నప్పటికీ, రాజ్యాంగ నిబంధనలు , ప్రతిపాదిత 131వ రాజ్యాంగ సవరణల ప్రక్రియ ప్రకారం పార్లమెంట్ సీట్లతో పాటు రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలు కూడా ఖచ్చితంగా పెరుగుతాయి. రాజ్యాంగంలో లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ప్రత్యేకమైన అధికరణలు ఉండటమే దీనికి ప్రధాన కారణం. భారత రాజ్యాంగం ప్రకారం లోక్‌సభ స్థానాల విభజన ఆర్టికల్ 81, 82ల ప్రకారం జరిగితే.. రాష్ట్ర శాసనసభ స్థానాల పునర్విభజన ఆర్టికల్ 170 పరిధిలోకి వస్తుంది. డీలిమిటేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు, రాజ్యాంగంలోని ఈ రెండింటికీ వేర్వేరుగా లేదా ఒకే రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా సవరణలు చేయాల్సి ఉంటుంది. ఆర్టికల్ 170 పై ఉన్న నిషేధాన్ని తొలగించకుండా కేవలం ఎంపీ సీట్లను పెంచడం సాధ్యపడదు. కాబట్టి డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమైతే లోక్‌సభతో పాటు ప్రతీ రాష్ట్ర శాసనసభ స్థానాల సంఖ్యను కూడా దామాషా పద్ధతిలో పెంచడానికి చట్టపరమైన ప్రాతిపదిక సిద్ధమవుతుంది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు సంబంధించి ఒక ప్రత్యేకమైన చట్టపరమైన కోణం కూడా ఉంది. 2014లో రూపొందించిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం లోని సెక్షన్ 26 ప్రకారం.. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 అసెంబ్లీ సీట్లను 225కి, తెలంగాణలో ఉన్న 119 సీట్లను 153కి పెంచాలని స్పష్టంగా పేర్కొన్నారు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 ప్రకారం 2026 తర్వాత జరిగే తొలి జనాభా లెక్కల వరకూ సీట్ల పెంపుపై ఫ్రీజ్ ఉన్నందున, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని ఆ నిబంధన అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు డీలిమిటేషన్ బిల్లు ద్వారా ఆర్టికల్ 170 సవరణ జరిగి నియోజకవర్గాల సరిహద్దుల ఫ్రీజ్ తొలగిపోతే.. తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపుకు ఉన్న ఏకైక రాజ్యాంగ అడ్డంకి పూర్తిగా తొలగిపోతుంది. మరి ఏపీ, తెలంగాణల్లో సీట్లు పెరుగుతాయనడానికి ఖచ్చితమైన గ్యారంటీ ఉందా అంటే.. సమాధానం నూటికి నూరు శాతం గ్యారంటీ అనే చెప్పాలి. ఎందుకంటే, కేంద్రం ప్రతిపాదిస్తున్న సార్వత్రిక డీలిమిటేషన్ నమూనా 50 శాతం స్థానాల పెంపు ప్రాతిపదిక ప్రకారం లేదా ఏపీ విభజన చట్టం సెక్షన్ 26 ప్రకారం చూసినా సీట్ల సంఖ్య పెరగడం ఖాయం. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. డీలిమిటేషన్ అమల్లోకి వస్తే ఏపీలో ప్రస్తుతం ఉన్న 25 లోక్‌సభ స్థానాలు 38కి, తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలు 26కి పెరుగుతాయి. లోక్‌సభ స్థానాలు పెరిగినప్పుడు, దానికి అనుగుణంగా ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలో అసెంబ్లీ స్థానాల విస్తరణ జరగడం తప్పనిసరి. ప్రస్తుతం ఒక పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయ్యాక ఏపీ అసెంబ్లీ స్థానాల సంఖ్య 175 నుంచి కనీసం 225 లేదా అంతకంటే ఎక్కువకి , తెలంగాణ అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 153 లేదా 160కి పైగా పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కావడం, అది ప్రకటన విడుదల చేయడం ద్వారా మాత్రమే కొత్త నియోజకవర్గాల సరిహద్దులు, ఎస్సీ/ఎస్టీ రిజర్వుడు స్థానాల వర్గీకరణ ఖరారవుతాయి. దీనికోసం ప్రత్యేకంగా రాష్ట్ర అసెంబ్లీలు మళ్లీ తీర్మానాలు చేయాల్సిన అవసరం లేదు. కేంద్ర పార్లమెంట్ ఆమోదించే డీలిమిటేషన్ చట్టమే రాష్ట్ర స్థానాల పెంపునకు నేరుగా వర్తిస్తుంది. ఈ సీట్ల పెంపు ప్రక్రియ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తీవ్రమైన రాజకీయ సంచలనాలకు, సమీకరణలకు దారితీయనుంది. ప్రతి నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి నాయకులకు, యువ నాయకులకు కొత్తగా ఎమ్మెల్యేగా పోటీ చేసే సువర్ణావకాశం లభిస్తుంది. అంతేకాకుండా, గ్రేటర్ హైదరాబాద్ వంటి పట్టణ ప్రాంతాల్లోనూ, అమరావతి పరిసర ప్రాంతాల్లోనూ జనాభా ప్రాతిపదికన మరిన్ని కొత్త నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఏపీలో 175, తెలంగాణలో 119 అసెంబ్లీ సీట్లతోనే ఎన్నికలు జరుగుతాయి. 2028 చివర్లో తెలంగాణ, 2029లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు పాత నియోజకవర్గాల ప్రాతిపదికనే జరగవచ్చు. ఇది ప్రజలకు కొత్త సమస్యలు తెస్తుంది. జనాభా పెరిగిన ప్రాంతాల్లో ఒక ఎమ్మెల్యేకి ఎక్కువ ఓటర్లు, అసమాన ప్రాతినిధ్యం ఉంటుంది. ఉదాహరణకు హైదరాబాద్, విజయవాడ, విశాఖ పట్టణ ప్రాంతాల్లో జనాభా ఎక్కువ కాబట్టి వారి సమస్యలు సరిగా ప్రతిబింబించకపోవచ్చు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు తగ్గినట్టు అనిపించవచ్చు. డీలిమిటేషన్ పార్లమెంట్‌కే పరిమితం కాదు, అది రాష్ట్రాల శాసనసభలను కూడా సమాంతరంగా పునర్వ్యవస్థీకరిస్తుంది. రాజ్యాంగ సవరణ బిల్లులు చట్ట రూపం దాల్చిన మరుక్షణమే డీలిమిటేషన్ కమిషన్ రంగంలోకి దిగుతుంది. అందువల్ల ఏపీ , తెలంగాణ అసెంబ్లీలలో స్థానాలు పెరగడం అనేది కేవలం ఒక రాజకీయ అంచనా మాత్రమే కాదు, రాజ్యాంగపరంగా, చట్టపరంగా జరగబోయే ఒక అనివార్యమైన పరిణామం!

# నియంతృత్వానికి యువత అడ్డుకట్ట!

నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఢిల్లీలో యువత సాగిస్తున్న ఆందోళనలపై పోలీసులు విరుచుకుపడి లాఠీచార్జి చేశారు. దీనికి సంబంధించి యూట్యూబ్ చానల్స్ చూస్తుంటే జంతర్ మంతర్ వద్ద 20 ఏండ్ల యువతి ఒక్క నిమిషం మాట్లాడిన మాటలు వింటే మనం ప్రజాస్వామ్య దేశంలోనే ఉన్నామా? అనిపించింది. కన్నీళ్లు ఉబికి వస్తుండడంతో ఆ యువతి మాటలు అస్పష్టంగా వచ్చాయి. 'పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. ఈ రోజు వీళ్లను పోలీసులు కొట్టడాన్ని చూశాక..నా నిర్ణయాన్ని మార్చుకున్నాను. నేను పోలీసునై ఉంటే వీళ్లలాగానే కొట్టాలి కదా? వీళ్లు చేసిన పాపం ఏమిటి? నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహించాలని కోరడమే పాపమా? అంతలా లాఠీలతో కొడతారా? అంటూ ఆ యువతి కన్నీళ్లు పెట్టుకున్నది. నీట్ పేపర్ పదే పదే లీకవుతున్నా కేంద్ర ప్రభుత్వానికి బాధ్యత లేదా? ప్రశ్నిస్తే నేరమా? ఇందిరాగాంధీ హయాంలో విధించిన 'ఎమర్జెన్సీ' గురించి పదే పదే ఉపన్యాసాలు ఇచ్చే కేంద్రంలోని బీజేపీ పాలకులు అంతకుమించిన నియంతృత్వంతో వ్యవహరిస్తున్నారు. ప్రజలకు పూచికపుల్ల కూడా విలువ ఇవ్వాల్సిన అవసరం లేదని భావిస్తున్నారు. మనకు ఏదైతే అందుబాటులో ఉంటుందో దాని విలువ మనకు తెలియదు. స్వేచ్ఛ కోల్పోయే వరకు స్వేచ్ఛ విలువ తెలియదు. దేశంలోని పలు రాష్ట్రాల్లో పరిస్థితులు చూస్తుంటే మెల్లగా నియంతృత్వానికి స్వాగతం పలుకుతున్నామని అనిపిస్తున్నది. నీట్ పేపర్ లీక్‌ను తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నా పాలకులకు పట్టడం లేదు. ఢిల్లీలో యువత మూడు వారాల నుంచి ఆందోళన చేస్తుంటే లాఠీఛార్జితోపాటు టియర్ గ్యాస్‌తో తీవ్రంగా హింసిస్తున్నారు. కానీ కోట్ల రూపాయల కుంభకోణం నీట్ లీకేజీకి బాధ్యత ఎవరూ తీసుకోవడం లేదు.

నీట్ పేపర్ లీకేజీ మొదటిసారి కాదు..ఇదొక ఆనవాయితీగా మారింది. ఇందులో కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయి. కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేసినంత మాత్రాన నీట్ పేపర్ లీకేజీ ఆగిపోతుందని కాదు. కానీ లీకేజీకి అమాత్యవర్యులు బాధ్యత వహించాలి కదా!

దేశంలో మోదీ ఏకస్వామ్య పాలన సాగిస్తుంటే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పాలకులు అదే మార్గంలో వెళ్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నీటిని వాడుకోవాలి, రైతులను ఆదుకోవాలి అని రిటైర్డ్ ఇంజినీర్లు చెప్పడమే పాపం.. వారిని జైలు పాల్జేస్తాను, బెల్ట్ చికిత్స చేస్తాను అని స్వయంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంటున్నారు. ఇలాంటి నియంతృత్వ వ్యాఖ్యలు గతంలో ఏ పాలకుడి నోటి నుంచి వినలేదు. తెలంగాణ సీఎంలా నోటిదురుసు ఆంధ్రా సీఎం చంద్రబాబుకు అస్సలు లేదు. కానీ మాట్లాడకుండానే ఆయన నియంతృత్వాన్ని అమలుచేస్తారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడిన మాటలనే ఒక యూట్యూబర్ ఇమిటేట్ చేస్తూ మాట్లాడగా అతనిపై వందల్లో కేసులు పెట్టారు. నాలుగుసార్లు బెయిల్ లభిస్తే ఐదవసారి ఉప కేసు పెట్టి మళ్లీ అరెస్ట్ చేశారు. మీడియా పార్టీల వారిగా బాధ్యతలు నిర్వహిస్తుంటే..యూట్యూబ్ చానల్స్‌తో పాలకులకు



కంటగింపుగా మారింది. దానితో యూట్యూబ్ వారిని అరెస్టులు చేయిస్తూ అసంతృప్తి స్వరాలను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణి చూసి రాష్ట్రాలు సైతం అదే మార్గంలో పయనిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ప్రజలకు బాధ్యత వహించాలి. కానీ మనం క్రమంగా నియంతృత్వానికి స్వాగతం పలుకుతున్నామని అనిపిస్తున్నది. ఒకసారి అధికారంలోకి వచ్చామంటే ఇక తాము ఎవరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నట్టుగా కొందరు పాలకులు వ్యవహరిస్తున్నారు.

నీట్ పేపర్ లీకేజీపై ఢిల్లీలో యువత ఉద్యమిస్తుంటే 'చైనా కుట్ర' అని ప్రచారం చేసే స్థాయికి నాయకులు చేరారంటే నీట్ పేపర్ లీక్ చేసింది చైనానా? చైనా లీక్ చేస్తుంటే మన వ్యవస్థలు ఏం చేస్తున్నట్టు? ఎవరైనా ప్రభుత్వాన్ని తప్పుపడితే పాకిస్థాన్ ఏజెంట్ అంటున్నారు. ఉద్యమిస్తే చైనా కుట్రనట. రైలు ప్రమాదం జరిగితే పాకిస్థాన్ కుట్ర అంటూ వెంటనే ప్రచారం చేస్తారు. ఒకవేళ నిజంగానే పాకిస్థాన్ మన రైళ్లను ప్రమాదాలపాలు చేసి ఎంతోమంది ప్రాణాలు తీస్తే కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు? గతంలో రైలు ప్రమాదాలు జరిగితే రైల్వే మంత్రి రాజీనామా చేయాలనే డిమాండ్ వినిపించేది. ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతినేది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఇలాంటి వైఫల్యాలను కూడా పాకిస్థాన్ కుట్ర పేరుతో తనకు అనుకూలంగా మార్చుకుంటున్నది.

పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగ నిర్మూలన, జీడీపీ వృద్ధి వంటి అంశాలను వదిలేసి, మతం ఆధారంగా మళ్లీ మళ్లీ అధికారం హస్తగతం చేసుకోవాలనేది బీజేపీ వ్యూహం. కానీ దేశంలో వినిపిస్తున్న యువత అసంతృప్తి స్వరాలు వింటుంటే రాజకీయాల్లో మార్పు సాధ్యమేమో అనిపిస్తున్నది. ఈ ఏడాది మే 15న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి 'నిరుద్యోగ బొద్దింకలు' కామెంట్ యువతలో కదలిక తీసుకువచ్చింది.

'కాక్రోచ్ జనతా పార్టీ' దేశంలోని అసంతృప్తి స్వరాలకు కేంద్రంగా మారింది. ఈ పార్టీ ఒక రాజకీయ పార్టీ కాదు, ఎన్నికల్లో పోటీ చేయదు, కానీ అధికారపక్షం అవకతవకలను జనంలోకి తీసుకువెళ్లడంలో, ప్రజల్లో చర్చను లేవనెత్తడంలో విజయం సాధించింది. 'నేను నియంతను' అని చెప్పకుండానే నియంతలా వ్యవహరిస్తున్న మోదీ ప్రభుత్వానికి ఈ పార్టీ కంటగింపుగా మారింది.

ప్రజాస్వామ్యాన్ని అమితంగా ప్రేమించిన నెహ్రూ కన్నా ఎక్కువ కాలం అధికారంలో మోదీ ఉన్నారని ఇటీవల గర్వంగా ప్రచారం చేసుకున్నారు. సంవత్సరాల లెక్క ప్రకారం ఎక్కువకాలం నిజమే. కానీ విలువల విషయంలోనూ పోలిక ఉండాలి కదా? నెహ్రూ తన మీద కార్టూన్‌లు వేస్తే కార్టూనిస్ట్‌కు ఫోన్ చేసి అభినందించేవారు. తన పాపులారిటీ రోజురోజుకూ పెరిగిపోతుండడంతో నియంతగా మారుతానేమోనని ఆయనకే అనుమానం వచ్చి తన ప్రభుత్వాన్నే తీవ్రంగా విమర్శిస్తూ మారుపేరుతో తానే వ్యాసాలు రాసుకున్నారు. అలాంటి నెహ్రూ కంటే ఎక్కువ కాలం అధికారంలో ఉన్న మోదీ మీడియా వాళ్లు అడిగే ప్రశ్నలకు 'నేను సమాధానం చెప్పడం ఏమిటి?' అన్నట్టు అధికారంలోకి వచ్చి 13 ఏండ్లు అవుతున్నా ఒక్కసారి కూడా మీడియా సమావేశంలో మాట్లాడలేదు. 'మౌనముని' అని మీడియా ఎగతాళి చేసినా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సైతం తరచూ మీడియా సమావేశాలు నిర్వహించి, వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పేవారు.

ప్రజాస్వామ్య దేశాల పాలకులు మీడియా వాళ్లు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్తారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు, నియంత కిమ్ జాంగ్ ఉన్ 2019లో హనాయ్ సమ్మిట్‌లో విదేశీ జర్నలిస్టుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. కానీ మోదీ పాలనలో మన దేశ మీడియాకు అంతటి అదృష్టం కూడా లేదు. ఢిల్లీలో జరుగుతున్న యువత ఉద్యమం పాలకుల్లో తప్పకుండా కదలిక తీసుకువస్తుంది. నాయకులు వస్తుంటారు, పోతుంటారు. ఈ దేశంలో ప్రజాస్వామ్యం శాశ్వతం అని యువత నిరూపిస్తుంది.

# నిరసన స్వరాలు వింటారా?

పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలిరోజైన సోమవారం ఢిల్లీ ఆకాశంలో నిరసన మబ్బులు దట్టంగా అలుముకున్నా యి. రాజవీధులన్నీ వేలాది యువగళాలతో హోరెత్తాయి. పన్నెండేళ్ల బాలిక మొదలుకొని అనేకమంది యువతీయువకులు పోలీసుల లాఠీచార్జిలో గాయపడి నెత్తురోడుతున్న, విలపిస్తూ నిలదీస్తున్న దృశ్యాలు చానెళ్లలో వీక్షించటం చాలామందికి కష్టంగా తోచింది. ఈ దశాబ్ద కాలంలో దేశ రాజధాని ఎన్నడూ చూడని దృశ్యాలివి. నీట్ ప్రశ్నపత్రాల లీక్‌పై గత నెల జూన్ 6 నుంచి కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) చేస్తున్న ఆందోళననూ, మూడు వారాలుగా కొనసాగుతున్న నిరశనలనూ మౌనంగా వీక్షిస్తూ ఉండిపోయిన ప్రభుత్వానికి సోమవారం నాటి 'చలో సంసద్' కళ్లు తెరిపించి ఉండాలి. అందుకే కావొచ్చు... కేంద్ర ఆరోగ్యమంత్రి జేపీ నడ్డా ఉద్యమ కార్యకర్తలను చర్చలకు పిలిచారు. అక్కడేమైంది, చివరకు ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుందన్న సంగతలా ఉంచితే ముందు వినడం పాలకులు చేయాల్సిన పని.



పదిహేనేళ్ల క్రితం అన్నా హజారే నిరశన మొదలెట్టినప్పుడు ఆనాటి యూపీఏ ప్రభుత్వం మొదట్లో పట్టించుకోకున్నా, ఆ తర్వాత కేంద్ర మంత్రులతో ప్రతినిధి బృందాన్ని పంపింది. దాన్ని సంపూర్ణంగా సమర్థించి, క్రియాశీలంగా పాల్గొని దేశవ్యాప్తంగా ఆ ఉద్యమానికి ఊపూ ఉత్సాహాన్నీ తీసుకొచ్చింది బీజేపీయే. అందుమూలంగా ఇతోధికంగా లాభపడింది కూడా. కానీ అదే పార్టీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇప్పుడు నిర్లిప్తంగా ఉండి పోవటం, సమస్యను ఇంత సంక్లిష్టం చేసుకోవటం దిగ్భ్రాంతికరం. ఈ ఆందోళనలో గాయపడిన వారిలో వందమంది వరకూ రాంమనోహర్ లోహియా ఆస్పత్రిలో చికిత్సకు చేరగా వారిలో తలలు పగిలినవారూ, కాళ్లూ చేతులూ విరిగినవారూ అనేకులున్నారని జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి. అటు 118 మంది పోలీసులు గాయాలతో ఆస్పత్రుల్లో చేరారని ఢిల్లీ పోలీసులు ప్రకటించారు.

పాలకులుగా ఎవరుండాలో ఎన్నికలు చెబితే... వారి పాలన ఎలావుందో నిరసనలు చెబుతాయి. అసమ్మతి అనేది దేశభక్తికి అత్యున్నత రూపం అంటాడు అమెరికా రాజనీతి శాస్త్ర ఆచార్యుడు హోవార్డ్ జిన్. ప్రజాస్వామ్యంలో విభేదించేందుకూ, అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకూ చోటివ్వడం ప్రభుత్వాల బాధ్యత. ఆ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావటం విపక్షాల బాధ్యత కూడా. కానీ విషాదమేమంటే ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఈ కర్తవ్య నిర్వహణలో విఫలమైంది. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఒకరోజు ధర్నా చేయటం మినహా చేసిందేమీ లేదు. అన్నా హజారే ఉద్యమ సమయంలో జరిగిందేమిటో గుర్తున్నా తాను చేయాల్సిందేమిటో ఆ పార్టీకి తెలిసేది. ఆ సంగతి ఆలస్యంగా గ్రహించి మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ నివాసం సమీపంలో రాహుల్, ప్రియాంక, ఇతర కాంగ్రెస్ ఎంపీలు ధర్నా చేశారు.

ఈ ఉద్యమానికి చెప్పుకోదగ్గ నాయకులంటూ ఎవరూ లేకపోవడం గమనించదగ్గది. నిరశనలో ఉన్న సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు అరెస్టుచేసి ఆస్పత్రిలో చేర్చారు. సీజేపీ నాయకుడు అభిజీత్ దీప్కేను ప్రదర్శన ప్రారంభంలోనే పోలీసులు అరెస్టు చేశారని వార్తలొచ్చాయి. కానీ దాదాపు 50,000 మంది వరకూ ఉన్న ఆందోళనకారులు గుంపులుగా విడిపోయి పార్లమెంటువైపు దూసుకెళ్లే ప్రయత్నం చేయటం, చాలావరకూ సఫలీకృతం కావటం చిన్న విషయం కాదు. పటేల్ చౌక్, జన్‌పథ్ గేటు మెట్రో స్టేషన్‌ల వద్ద, అశోకా రోడ్, కన్నాట్‌ప్లేస్ సర్కిల్ వద్ద బైఠాయింపులు, మరో అయిదుచోట్ల వారిపై బాష్ప వాయు గోళాలు ప్రయోగించటం సమస్య తీవ్రతను వెల్లడిస్తుంది.

హింసకూ, దౌర్జన్యానికీ దిగినవారిని నియంత్రించటాన్ని ఎవరూ ప్రశ్నించరు. కానీ ఒక్కరిని చేసి ఏడెనమండుగురు పోలీసులు లాఠీలతో మోదటం, ఆడపిల్లలని కూడా చూడకుండా హింసించటం సబబేనా? 'మీ ఇంట్లో పిల్లలు లేరా? ఇంత దారుణంగా కొడతారా?' అని ఒక బాలిక ప్రశ్నించటం, తన దుస్తులు చించారని మరొకామె ఆరోపించటం ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచదు. పరీక్షపత్రాలు లీకవటం, కష్టపడి చదివేవారు దగాపడటం తొలిసారి కాదు. ఏళ్లతరబడి ఇలా జరగటంవల్లే పరిస్థితి ఇంతవరకూ వచ్చింది. ఇకనైనా విద్యార్థుల అభీష్టాన్ని వినటం, సానుకూలంగా స్పందించటం ప్రభుత్వ బాధ్యత. లేకుంటే సమస్య మరింత జటిలమవుతుంది.

# వరంగల్ విమానాశ్రయానికి రూ.497 కోట్లు

**వరంగల్ :** తెలంగాణలోని వరంగల్ మామ్నూర్ విమానాశ్రయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మామునూరు ఎయిర్‌పోర్టును రూ.496.86 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రన్‌వే, అప్రాన్, ట్యాక్సీవే మరియు బౌండరీ వాల్ నిర్మాణం వంటి మౌలిక వసతుల పనుల కోసం ప్రాథమిక టెండర్లను కూడా ఏఏఐ విడుదల చేసింది. మామ్నూర్ విమానాశ్రయ నిర్మాణ పనులు భూసేకరణ, అవసరమైన అనుమతుల ప్రక్రియ పూర్తయిన తర్వాతే వేగవంతం కానున్నాయి. మామునూరు ఎయిర్‌పోర్టు ప్రారంభమయ్యే సమయం పూర్తిగా భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యే సమయంపైనే ఆధారపడి ఉంటుందని కేంద్ర పౌర విమానయాన శాఖ స్పష్టం చేసింది. రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ కేంద్రం ఈ వివరాలను వెల్లడించింది. వరంగల్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ.496.86 కోట్ల అంచనాతో అనుమతులు మంజూరు చేసినట్లు కేంద్ర పౌర విమానయానశాఖ సహాయమంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌లు అడిగిన ప్రశ్నలకు ఈ సమాధానం ఇచ్చారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణం పూర్తయ్యే సమయం అనేది భూసేకరణ, చట్టబద్ధమైన అనుమతులపై ఆధారపడి ఉంటుందన్నారు. ఉడాన్ స్కీమ్ కింద తెలంగాణ నుంచి ఇప్పటివరకు 58 విమాన మార్గాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి టెక్నో-ఎకనామిక్ ఫీజిబిలిటీ అధ్యయనాన్ని ఏఏఐ ఇప్పటికే పూర్తి చేసి, అక్కడ అవసరమయ్యే భూమి




వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది.రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై స్పందించారు.. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ ఉమ్మడిగా ఉపయోగించుకోవడానికి ఉన్న అవకాశాలపై ఏఏఐ అధ్యయనం చేసి, అవసరమైన భూమి వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు మంత్రి తెలిపారు. పెద్దపల్లిలో ప్రీ-ఫీజిబిలిటీ నివేదికను ఫిబ్రవరిలోనే సమర్పించినట్లు చెప్పారు. అయితే, భద్రాద్రి కొత్తగూడెంలోని రామవరం, చెంచుపల్లి, సుజాతనగర్ పరిధిలోని స్థలాల్లో ఏఏఐ విచారణ జరపగా, అక్కడ ఉన్న కొండలు, రైల్వే లైన్ల కారణంగా విమానాశ్రయ నిర్మాణం సాధ్యం కాదని తేల్చిచెప్పినట్లు వివరించారు.తెలంగాణలో కొత్తగా ఎలాంటి మెట్రో రైలు ప్రాజెక్టులకూ కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ రాజ్యసభలో బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫస్ట్ ఫేజ్ రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానంలో అమలు చేసిందని, ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుకు వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద కేంద్ర ఆర్థిక శాఖ రూ.1,204 కోట్లు విడుదల చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఎలాంటి మెట్రో ప్రాజెక్టూ అమల్లో లేదని స్పష్టం చేశారు.

# బీజేపీ నేతలకు గ్రేటర్ ఎన్నికలే మొదటి టాస్క్

**హైదరాబాద్ :** గ్రేటర్ లో జరగాల్సిన మూడు కార్పొరేషన్ల ఎన్నికలపై భారతీయ జనతా పార్టీ తన పొలిటికల్ ఫోకస్‌ను తీవ్రం చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూడు ప్రధాన కార్పొరేషన్లతో పాటు, నార్త్ తెలంగాణకు గుండెకాయ లాంటి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఈసారి ఎలాగైనా కైవసం చేసుకోవాలని బీజేపీ అధిష్ఠానం పక్కా వ్యూహాన్ని రచిస్తోంది. ఇప్పటికే నితిన్ నవీన్ మూడు రోజుల పాటు పర్యటించి.. . గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల పరిధిలోని బూత్ ప్రెసిడెంట్లతో, రాష్ట్ర కార్యవర్గంతో జరిపిన కీలక భేటీలలో దీనికి సంబంధించిన ముసాయిదా సిద్ధమైంది. ఇక్కడి సమస్యలను గుర్తించి నేతల మధ్య సయోధ్య ప్రయత్నాలు కూడా పూర్తి చేశారు.ఈ మెగా ఎన్నికల సమరానికి సంబంధించి వ్యూహాల అమలు, నిధులు, వనరుల సమీకరణ పై బీజేపీ అగ్రనాయకత్వం ఒక స్పష్టమైన బ్లూప్రింట్‌ను ఖరారు చేసింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో, వరంగల్ అర్బన్ బెల్ట్‌లో పార్టీకి వచ్చిన భారీ ఓటింగ్ శాతాన్ని క్షేత్రస్థాయిలో సీట్లుగా మార్చుకోవడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం. జీహెచ్ఎంసీ పరిధిలో కేవలం సోషల్ మీడియా ప్రచారాలకే పరిమితం కాకుండా, ప్రతి డివిజన్‌లోనూ బలమైన ఆర్థిక, అంగబలం ఉన్న అభ్యర్థులను ఇప్పుడే గుర్తించి వారికి రూట్ మ్యాప్ ఇవ్వాలని, ఎన్నికల ఖర్చులకు వెనకాడకుండా వనరులను ముందే సర్దాలని ఈ కీలక భేటీలో నిర్ణయించారు.బీజేపీ లీడర్‌షిప్ ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్, వరంగల్ కార్పొరేషన్ల పరిధిలో నిశ్శబ్దంగా అంతర్గత సర్వేలు చేయించింది. సిట్టింగ్ కార్పొరేటర్ల పనితీరు, అధికార కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఉన్న యాంటీ-ఇంకంబెన్సీ , బీఆర్ఎస్ కేడర్ బలాబలాలపై



స్పష్టమైన రిపోర్ట్ సిద్ధం చేసుకుంది. ఈ సర్వే నివేదికల ఆధారంగానే వరంగల్ కార్పొరేషన్‌లో ఈసారి క్లీన్ స్వీప్ చేయాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది. వరంగల్‌లో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ క్రమంగా పడిపోతుండటం, కాంగ్రెస్ అంతర్గత విభేదాలు తమకు కలిసివస్తాయని కమలనాథులు అంచనా వేస్తున్నారు. ఇటు హైదరాబాద్ పరిధిలోని సైబరాబాద్, మల్కాజ్‌గిరి ఐటీ, అర్బన్ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రచారాస్త్రాలుగా మార్చుకోనున్నారు.ప్రస్తుతానికి అధికార కాంగ్రెస్ పార్టీ నగరాల్లో పట్టు కోసం చూస్తుండగా, పాత బస్తీకి పరిమితమైన ఎంఐఎం తో దోస్తీ కట్టి లబ్ధి పొందాలని చూస్తోందని.. దీనిని హిందూ ఓటర్లలో సెంటిమెంట్‌గా మార్చాలని బీజేపీ ప్లాన్ చేస్తోంది. రాబోయే రెండు, మూడు నెలల్లోనే ఈ గ్రేటర్ ఎన్నికల నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉన్నందున.. అభ్యర్థుల ఎంపిక నుండి పోలింగ్ బూత్ మేనేజ్‌మెంట్ వరకు అంతా ముందే సెట్ చేసుకోవాలనే కమల వ్యూహం, తెలంగాణ కార్పొరేషన్ల పీఠాలపై ఏ మేరకు జెండా పాతేలా చేస్తుందో చూడాలి.

# జెన్ జీ జపంలో గులాబీ

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు తెరలేస్తోంది. ఇప్పటిదాకా గ్రామీణ ఓటర్లు, రైతాంగ సమస్యలు, ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోళ్ల చుట్టూనే తమ రాజకీయ వ్యూహాలను తిప్పిన ఃఖీ, ఇప్పుడు రూట్ మార్చింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో యువత, నిరుద్యోగులే లక్ష్యంగా ఒక పక్కా పొలిటికల్ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తోంది. తాజాగా హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో నిర్వహించిన 'యువ సంగ్రామ సదస్సు' బీఆర్ఎస్ రాబోయే రాజకీయ కార్యాచరణకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది. ఊహించని స్థాయిలో తరలివచ్చిన యువత, ఉద్యోగ నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ అమలుపై వ్యక్తం చేసిన నిరసన ప్రభుత్వంపై ఎంతటి అసంతృప్తి ఉందో స్పష్టం చేసింది. ఈ జనాగ్రహాన్ని క్యాచ్ చేస్తూ, నిరుద్యోగ సమస్యననే రాబోయే రోజుల్లో తమ ప్రధాన రాజకీయ అస్త్రంగా మార్చుకోవాలని బీఆర్ఎస్ డిసైడ్ అయింది.ఈ వ్యూహంలో అత్యంత ఆసక్తికరమైన అంశం? జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను స్థానిక రాజకీయాలకు కేటీఆర్ జోడించిన తీరు! ఇటీవల నేపాల్‌లో యువత చేపట్టిన 'జెన్ జీ మూవ్‌మెంట్' సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సరిగ్గా ఇదే పాయింట్‌ను కేటీఆర్ తన డిజిటల్ వ్యూహంలో భాగం చేసుకున్నారు. పది నెలల క్రితం తాను చేసిన ఒక ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ "ప్రభుత్వాలు జెన్ జీ, యువత ఆకాంక్షలను నిర్లక్ష్యం చేస్తే పరిణామాలు ఎలా ఉంటాయో ప్రపంచ పరిణామాలే నిదర్శనం" అని పేర్కొన్నారు. నిరుద్యోగ తిరుగుబాటును తాను ముందే ఊహించాననే చర్చకు ఇది గట్టి పునాది వేసింది.బీఆర్ఎస్ కొత్త స్ట్రాటజీ వెనుక కొన్ని ముఖ్యమైన అంశాలున్నాయి. కేవలం పల్లెలు, రైతులకే పరిమితం కాకుండా పట్టణాల్లోని గ్రాడ్యుయేట్లు, విద్యార్థులు, ఉద్యోగార్థులను తమ వైపు తిప్పుకునే స్కెచ్ ఉంది. గ్రూప్ ఎగ్జామ్స్ రద్దు, నోటిఫికేషన్ల లీకేజీలు, నియామకాల జాప్యం వంటి అంశాలపై



నిరుద్యోగుల్లో ఉన్న ఆక్రోశానికి నాయకత్వం వహించడం ద్వారా వాళ్లకు తాము అండగా ఉన్నామనే భరోసా కల్పిస్తున్నారు. సోషల్ మీడియాలో నిమిషాల్లో ట్రెండ్స్ మార్చే తాజా తరం మద్దతు కూడగట్టడం ద్వారా క్షేత్రస్థాయిలో పెను మార్పులు తీసుకురావాలనేది దీని వెనుక ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.రాబోయే రోజుల్లో ప్రతి జిల్లా కేంద్రంలో నిరుద్యోగ నిరసనలు, యువజన సదస్సులు నిర్వహించేందుకు బీఆర్ఎస్ బ్లూప్రింట్ సిద్ధం చేస్తోంది. గతంలో సాధించిన రైతాంగ పోరాట అనుభవానికి, ఇప్పుడు యువత ఉద్రేకాలను జతచేసి భవిష్యత్తులో ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి పెంచడమే కేటీఆర్ ప్రధాన లక్ష్యం. అయితే, కేవలం అధికార పక్షాన్ని విమర్శించడమే కాకుండా, తాము మళ్లీ వస్తే యువత సమస్యలకు ఎలాంటి పరిష్కారం చూపుతామో నమ్మించడమే బీఆర్ఎస్ ముందున్న అసలైన సవాలు. మరి కేటీఆర్ ప్రయోగించిన ఈ జెన్ జీ కార్డ్ ఏ స్థాయిలో వర్కవుట్ అవుతుందో, గులాబీ దళానికి పూర్వవైభవం తెచ్చిపెడుతుందో లేదో వేచి చూడాల్సిందే!

## పోటీకి రెడీ అవుతున్న తోట

**గుంటూరు :** మాజీ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్ తిరిగి యాక్టివ్ అయ్యేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆయన ఏ పార్టీలో చేరతారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తోట చంద్రఖేశఖర్ బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఇప్పుడు ఆ పార్టీలో దాదాపుగా లేరనే చెప్పాలి. తాజాగా తోట చంద్రశేఖర్ రెండు పార్టీల వైపు చూస్తున్నట్లు తెలిసింది. బీజేపీలో చేరడం, లేదా వైసీపీలో చేరడంపైనే ఆయన ఎక్కువగా ఫోకస్ పెట్టినట్లు తెలిసింది. జనసేనలో చేరే అవకాశం లేకపోవడంతో ఇక ఈ రెండు పార్టీల్లో ఏదో ఒక దానిలో చేరి వచ్చే ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు. అయితే రెండు పార్టీల నుంచి ఇంకా గ్రీన్ సిగ్నల్ రాలేద చిరంజీవితో సమావేశం తర్వాత... కొంత కాలం క్రితం మెగాస్టార్ చిరంజీవితో తోట చంద్రశేఖర్ సమాశమయ్యారు. తోట చంద్రశేఖర్ జనసేనలో చేరబోతున్నారన్న ప్రచారం గత కొంత కాలంగా జరుగుతుంది. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమి నేపథ్యంలో ఆయన బీఆర్ఎస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి జనసేనలో చేరతారని జోరుగా ఊహాగానాలు వచ్చాయి. అందుకే చిరంజీవిని కలిశారని అనుకున్నారు. కానీ జనసేన నుంచి ఆయనకు సానుకూల స్పందన రాలేదని తెలిసింది. ఆయన సొంత మీడియాలో కూడా జనసేనకు వ్యతిరేకంగా వార్తలు వస్తున్న నేపథ్యంలో వైసీపీ లేదా బీజేపీలో చేరతారని తాజాగా ఆయన అనుచరులు చెబుతున్నారు.... తోట చంద్రశేఖర్ కాపు సామాజికవర్గం కావడంతో వైసీపీ కూడా ఆయన చేరిక పట్ల కొంత సానుకూలతగా ఉన్నట్లు తెలిసింది. గుంటూరు జిల్లాలోనే ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని తోట చంద్రశేఖర్ భావిస్తున్నారు. ఆ హామీ పార్టీ నాయకత్వం నుంచి లభిస్తే త్వరలోనే ఆయన చేరిక ఉంటుందని అంటున్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో బలమైన నేత అవసరం తోట చంద్రశేఖర్ సామాజికవర్గం పరంగా, ఆర్థికంగా బలమైన నేత కావడంతో ఆయన చేరికకు పెద్దగా అభ్యంతరాలు ఉండకపోవచ్చని అంటున్నారు. త్వరలోనే తోట చంద్రశేఖర్ చేరిక ప్రకటన వస్తుందని, తద్వారా వైసీపీకి కూడా కాపు సామాజికవర్గం నుంచి మరికొంత బలం చేకూరుతుందని ఆ పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. అయితే జగన్ దీనిపై ఫైనల్ డెసిషన్ తీసుకోవాల్సి ఉంది.

## రెడ్కో డీఈ నివాసంలో ఏసీబీ సోదాలు

**హైదరాబాద్ :** తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ుఉఖీఇఆఅూ) డీఈ ముత్యం వెంకటరమణ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మాదాపూర్లోని ఆయన ఇంటితో పాటు మొత్తం 10కి పైగా ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. డీఎస్పీ మాజి ఖాన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సోదాలు ఆదాయానికి మించిన ఆస్తుల కేసుకు సంబంధించినవిగా సమాచారం.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మార్కాపురం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం..

## కారులో ఇరుక్కున్న వ్యక్తి

మార్కాపురం మండలం తిప్పాపాలెం ? చింతకుంట్ల గ్రామాల మధ్య ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న బొలెరో కారు ప్రమాదానికి గురికావడంతో అందులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి కారులో ఇరుక్కుపోయాడు.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది తీవ్రంగా శ్రమించి కారులో చిక్కుకున్న వ్యక్తిని సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం అతడిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు.ప్రమాదానికి గల కారణాలు, గాయపడిన వారి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మద్యం మత్తులో తల్లితో గొడవ

## తల్లి చేతిలో దారుణ హత్య

అవనిగడ్డలో మంగళవారం రాత్రి దారుణం చోటుచేసుకుంది. చల్లపల్లి పడమర వీధిలో మద్యం మత్తులో ఉన్న కొడుకు మోతుకూరి దుర్గాప్రసాద్ (35) తన తల్లి నాగమణిపై దాడికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో తల్లి నాగమణి ఎదురు తిరిగి కొడుకుని కొట్టడంతో అతను మృతి చెందాడు. అనంతరం తల్లి నాగమణి పరారైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

## వరుస తప్పులతో ఉదయ్ కృష్ణారెడ్డి

**ఒంగోలు, హైదరాబాద్ :** ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్ కాంపిటీటర్లకు ఆదర్శంగా నిలిచి, శ్రమించి సాధించిన విజయాన్ని ఒక క్రమశిక్షణతో ముందుకు తీసుకెళ్లాల్సిన ఒక ఐపీఎస్ ట్రైనీ అధికారి.. వ్యక్తిగత ప్రవర్తనా లోపాలు, విలువలేని నిర్ణయాలతో తన చేజేతులా కెరీర్‌ను నాశనం చేసుకున్న ఆశ్చర్యపరుస్తోంది. ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారంలో వెలుగు చూసిన వరుస పరిణామాలు, సహ-ట్రైనీతో వివాదం , ఆ తర్వాత చోటుచేసుకున్న డ్రామాలు ఆయన తీవ్రమైన నైతిక పతనానికి నిదర్శనంగా నిలిచాయి. ఉన్నతమైన స్థానానికి చేరుకున్న తొలి మెట్టులోనే నైతికంగా దృఢంగా నిలబడాల్సింది పోయి, ప్రవర్తనా నియమావళిని విస్మరించడం వల్లనే ఈ పరిణామాలు పీకల మీదకు వచ్చాయి.తోటి వివాహిత ట్రైనీ ఐపీఎస్ అధికారితో ఉన్న వ్యక్తిగత సంబంధం బెడిసికొట్టడం, దానిపై పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కేంతగా విభేదాలు రావడం ఒక ఎత్తయితే.. ఆ తర్వాత ఆయన ప్రదర్శించిన వైఖరి మరింత ఆశ్చర్యానికి గురిచేసింది. సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత విషయాలను బహిర్గతం చేయడం, లీగల్ నోటీసులకు విరుద్ధంగా వ్యవహరించడం , సింపతీ పొందడానికి ఆత్మహత్యాయత్నం నాటకాలు ఆడటం వంటి చర్యలు సర్వీస్ నిబంధనలకు సంపూర్ణంగా విరుద్ధం. ఇద్దరు వ్యక్తుల మధ్య పరస్పరం మాట్లాడుకుని సర్దుబాటు చేసుకోవాల్సిన లేదా చట్టబద్ధంగా పరిష్కరించుకోవాల్సిన సమస్యను రోడ్డున పడేసి, రచ్చ చేసుకోవడం ద్వారా ఉదయ్ కృష్ణారెడ్డి తన ప్రొఫెషనలిజాన్ని గాలికి వదిలేశారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు.భారత సివిల్ సర్వీసెస్‌లో పనిచేసే అధికారులకు నైతికత , ఆత్మనిగ్రహం, భావోద్వేగ నియంత్రణ అత్యంత కీలకమైన అంశాలు. బాధ్యతాయుతమైన ఐపీఎస్ అధికారిగా దేశానికి సేవ చేయాల్సిన వ్యక్తి, ట్రైనింగ్ దశలోనే ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు, నైతిక లోపాలు ఎదుర్కొని కేంద్ర హోంశాఖ ద్వారా సస్పెన్షన్‌కు గురికావడం ఒక రకంగా వ్యవస్థాత్మక వైఫల్యాన్ని కూడా ఎత్తిచూపుతోంది. విజయం నెత్తికెక్కించుకోకుండా, తన లక్ష్యాన్ని, రాజ్యాంగ బద్ధమైన బాధ్యతలను నిరంతరం గుర్తు చేసుకుంటూ ముందుకు సాగాల్సిన ఉదయ్ కృష్ణారెడ్డి.. తప్పు మీద తప్పు చేస్తూ తన కెరీర్‌ను రిస్కులో పెట్టుకున్నారుఇప్పుడు ప్రభుత్వం, కేంద్ర హోంశాఖ తీసుకున్న కఠిన చర్యల వల్ల ఆయనకు తన తప్పులను దిద్దుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. ఐపీఎస్ స్థాయికి ఎదిగినప్పటికీ వ్యక్తిగత జీవితంలో నియంత్రణ, బాధ్యత లోపిస్తే ఎంతటి ఉన్నతమైన కెరీర్ అయినా క్షణాల్లో తుడిచిపెట్టుకుపోతుందనడానికి ఈ సంఘటన ఒక బలమైన హెచ్చరిక. సివిల్ సర్వీసెస్ సాధించాలనుకునే వేలాది మంది యువతకు ఉదయ్ కృష్ణారెడ్డి ఉదంతం ఒక పాఠంగా నిలవనుంది. సామర్థ్యం ఎంత ముఖ్యమో, వృత్తిపరమైన, వ్యక్తిగత నైతికత అంతకంటే ముఖ్యం. విజయం మత్తులో ఉదయ్ దీన్ని మర్చిపోయారు. కోల్పోయారు.

## వచ్చేసిన డెంగీ టీకా

**ముంబై :** ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారిన డెంగీ మహమ్మారి నివారణకు భారత్ లో సరికొత్త ఆయుధం అందుబాటు లోకి వచ్చింది. దేశంలోనే మొట్టమొదటి డెంగీ నివారణ వ్యాక్సిన్ 'క్యుడెంగా' విడుదలకు భారత ఔషధ నియంత్రణ సంస్థ అధికారికంగా అనుమతి మంజూరు చేసింది. ఈ వ్యాక్సిన్‌ను జపాన్‌కు చెందిన ప్రముఖ గ్లోబల్ బయోఫార్మాస్యూటికల్ కంపెనీ 'తకేడా' అభివృద్ధి చేసింది. డెంగీ నివారణ కోసం మన దేశంలో డీసీజీఐ ఆమోదం పొందిన తొలి టీకా ఇదే కావడం గమనార్హం.తకేడా బయో ఫార్మాస్యూటికల్స్ ఇండియా అందించిన వివరాల ప్రకారం, 4 సంవత్సరాల వయస్సు నుండి 60 సంవత్సరాల వయస్సు వరకు ఉన్నవారందరూ ఈ 'క్యుడెంగా' వ్యాక్సిన్ తీసుకోవడానికి అర్హులు. ముఖ్యంగా, గతంలో డెంగీ బారిన పడిన వారైనా లేదా అసలు డెంగీ సోకని వారైనా సరే.. ఎవరైనా ఈ టీకాను నిర్భయంగా తీసుకోవచ్చు. సాధారణంగా కొన్ని రకాల వ్యాక్సిన్లు ఇచ్చే ముందు రక్తం లేదా ఇతర పరీక్షలు చేయాల్సి ఉంటుంది. కానీ, ఈ క్యుడెంగా టీకా తీసుకోవడానికి ఎటువంటి ముందస్తు పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం లేదు.

# విద్యార్థులపై లాఠీచార్జి బీజేపీ నియంతృత్వానికి నిదర్శనం: సీపీఎం




**నవగీతం తల్లాడ ప్రతినిధి** ఢిల్లీలో శాంతియుతంగా పార్లమెంట్ మార్చ్ చేపట్టిన విద్యార్థులపై కేంద్ర పోలీసు బలగాలు దారుణంగా లాఠీచార్జి చేయడాన్ని సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం తల్లాడ మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 2014 నుంచి బీజేపీ పాలనలో వరుసగా పేపర్ లీకేజీలు జరుగుతూ కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ఈ ఏడాది నీట్ లీకేజీ వల్ల 32 లక్షల మంది అభ్యర్థులు అనిశ్చితికి గురయ్యారని ఆ9వేదన వ్యక్తం చేశారు. లీకేజీలపై ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనన్నారు. ?విద్యార్థుల న్యాయమైన పోరాటాలపై దాడులకు దిగడం బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ వైఖరికి అద్దం పడుతోందని, బాధితులకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని సత్యనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కేంద్ర వైఖరిపై పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు చలమాల విట్టల్‌రావు, అయినాల రామలింగేశ్వరరావు, కొలికపోగు సర్వేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, చల్లా నాగేశ్వరరావు, సత్తెనపల్లి నరేష్, వేలాద్రి, ఇబ్రహీం తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల 'ఎలక్ట్రికల్ ఆటోక్యాడ్' వర్క్‌షాప్ ప్రారంభం




**నవగీతం,కొడిమ్యాల:** జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ జగిత్యాల (అటానమస్)లోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగం ఆధ్వర్యంలో, నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (ఎన్‌ఎస్‌ఐసీ), హైదరాబాద్ సహకారంతో 'ఎలక్ట్రికల్ ఆటోక్యాడ్' అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది.ముఖ్య అతిథుల ఆహ్వానం, జ్యోతి ప్రజ్వలన, విద్యార్థుల స్వాగత గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈఈఈ విభాగాధిపతి డా. సి. రాధాచరణ్ మాట్లాడుతూ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆధునిక విద్యుత్ రూపకల్పనలో ఎలక్ట్రికల్ ఆటోక్యాడ్‌కు విశేష ప్రాధాన్యం ఉందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రిన్సిపాల్ డా. జి. నర్సింహ మాట్లాడుతూ,పరిశ్రమలు--విద్యాసంస్థల సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్ విద్యార్థుల్లో ఉపాధి నైపుణ్యాలను పెంపొందించి,ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడంలో దోహదపడుతుందని తెలిపారు. ఈఈఈ విభాగం ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.వర్క్‌షాప్‌లో రిసోర్స్ పర్సన్లుగా ఎన్‌ఎస్‌ఐసీ హైదరాబాద్ మేనేజర్ డా. టి.ముత్తుకుమారన్, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ (ఈసీఏడీ) శ్రీ రాబిన్ జేమ్స్ పాల్గొని, ఎలక్ట్రికల్ ఆటోక్యాడ్ ద్వారా విద్యుత్ వ్యవస్థల రూపకల్పన, ప్యానెల్ డిజైన్, ఇండస్ట్రియల్ డ్రాయింగ్, ప్రాజెక్ట్ డాక్యుమెంటేషన్ తదితర అంశాలపై విద్యార్థులకు సైద్ధాంతిక, ప్రాయోగిక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డా. జి. నర్సింహ అధ్యక్షత వహించగా, వైస్ ప్రిన్సిపాల్ డా.కె. శ్రీనివాస్, ఈఈఈ విభాగాధిపతి డా.సి.రాధాచరణ్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ రెండు రోజుల వర్క్‌షాప్‌కు డా. ఎస్. జగదీష్ కుమార్, డా.పి. సంగీత సమన్వయకర్తలుగా వ్యవహరిస్తుండగా, ఈఈఈ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

## ధర్మగ్రంథాలతో భూపతిపూర్ శ్రీ లక్ష్మినారసింహ స్వామి వారి రెండవ గిరిప్రదక్షిణ..



**నవగీతం, రాయికల్ ప్రతినిధి:**జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామంలో గల గుట్టపై స్వయంభూ గా వెలసి భక్తుల కొంగుబంగారమై కోరిన కోర్కెలు తీర్చుతున్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి అవతార తిరునక్షత్రం సందర్భంగా బుధవారం భక్తులు గోవింద నామాలతో, జై శ్రీరామ్ నినాదాలతో గిరిప్రదక్షిణ చేసారు. గిరిప్రదక్షిణ వ్యవస్థాపకులైన గ్రామ వాస్తవ్యులు గోనె రాములు యాదవ్, భక్తులు కలిసి ధర్మగ్రంథాలను తలపై ఎత్తుకుని శ్రీ లక్ష్మినారసింహ స్వామి వారి గుట్ట చుట్టు రెండవ గిరిప్రదక్షిణ చేసారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కాకుస్తం వెంకటరమణాచార్యులు, కాకుస్తం వెంకటకృష్ణమాచార్యులు మాట్లాడుతూ భక్తుల అభీష్టం మేరకు ప్రతి నెలకు ఒక సారి వచ్చే స్వాతి నక్షత్రం రోజు గిరిప్రదక్షిణ చేపట్టాలని నిర్ణయించామని, భగవత్ కార్యాన్ని భగవంతుడే చేయించుకుంటున్నాడని అన్నారు. గిరిప్రదక్షిణ వ్యవస్థాపక గురుస్వామి గోనె రాములు యాదవ్ మాట్లాడుతూ శ్రీ కొండగట్టు గిరిప్రదక్షిణ ప్రారంభైన నుండి ప్రతీసారి పాల్గొనడం ద్వారా స్వగ్రామమైన భూపతిపూర్ లో శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి గిరిప్రదక్షిణ కూడా చేపట్టాలనే సంకల్పం రావడంతో దేవుడి అనుగ్రహం తో ఈ నెల 25 న పరాభవనామ సంవత్సరం జ్యేష్ఠ శుక్లపక్షం స్వాతి నక్షత్రం రోజు భక్తులతో కలిసి మొదటి గిరిప్రదక్షిణ చేయడం జరిగిందని అన్నారు.ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతతో సర్వసంకల్పాలు నెరవేరుతాయని అన్నారు.వచ్చే ఆగష్టు-19 బుధవారం స్వాతి నక్షత్రం సందర్భంగా మూడవ గిరిప్రదక్షిణ కలదని కావున భక్తులు తరలివచ్చి శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి అనుగ్రహం పొందాలని అర్చకులు కోరారు.

## మండల కేంద్రంలో అన్ని ఆదివాసీ సంఘాల సమావేశం



**నవగీతం, ములుగు;** ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలోని కొమరంభీం విగ్రహం వద్ద బుధవారం మండలంలోని అన్ని ఆదివాసీ సంఘాల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈయొక్క సమావేశ ముఖ్య ఉద్దేశం గురించి మాట్లాడుతూ ఆగస్టు 9న జరగబోయే ప్రపంచ ఆదివాసి దినోత్సవం జరుపుట గురించి అభిప్రాయ సేకరణ మరియు ఆదివాసి చట్టాల అమలుపైన చర్చించి భవిష్యత్తులో అన్ని సంఘాలు ఏకమై ఆదివాసి గ్రామాలలో ప్రజలకి చట్టాల పైన అవగాహన కల్పించడమే కాకుండా ప్రతి గ్రామపంచాయతీ, గ్రామాలలో ఆదివాసీ దినోత్సవం జరుపుకోవాలని, గ్రామ సర్పంచులు గ్రామ పెద్దలు మోబ్లైజర్స్ గ్రామ యువకులు ఆదివాసి మహిళలు తదితరులు పాల్గొనీ విజయవంతం చేయాలనితెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు పాయం జానకి రమణ ఆదివాసి నవనిర్మాణ సేవ జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్ ములుగు జిల్లా ఆదివాసి విద్యార్థి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు బోదెబోయిన సురేష్ తుడుం దెబ్బ నాయకులు లక్ష్మణ్ గోండు వాన విద్యార్థి సంక్షేపరిసత్ నాయకులు పద్ధ సుధాకర్ అధ్యక్షులు నాయకులు పీసా మండలం అధ్యక్షులు ఇండ్ల సమ్మయ్య గ్రామ పెద్దలు యాలం సుబ్బయ్య యువకులు కోరశీ మనోజ్ కుమార్ తలడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .

## హమ్మయ్య.. వానలు పడ్డాయ్...

**అదిలాబాద్ :** ఎట్టకేలకు వరుణుడు కాస్త కరుణించడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల ముఖాల్లో మళ్లీ చిరునవ్వులు కనిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా వర్షం జాడ లేక ఎండిపోతున్న పంటలను చూసి ఆందోళన చెందుతున్న రైతులకు తాజాగా కురిసిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పెద్ద ఊరటనిచ్చింది. ఎన్ లీనో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ జల్లులు కొత్త ఆశలను నింపాయి. ఈ వానాకాలం ప్రారంభమైనప్పటి నుంచి జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. అడపాదడపా కురిసిన చిరు జల్లులు కూడా సాధారణ వర్షపాతాన్ని నమోదు చేయలేకపోయాయి. దీంతో పంటలు ఎండిపోతాయనే భయంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ఒకవైపు పొలాల్లో తేమ పూర్తిగా తగ్గిపోగా, మరోవైపు వర్షం కోసం రైతులు కళ్లు

## సీసీ రోడ్డుపై నిలిచిన నీటిని జేసీబీ సాయంతో తొలిగింత



**నవగీతం,ములుగు జిల్లా ప్రతినిధి:** ములుగు జిల్లా వాజేడు మండలంలోని మొరుమూరు గ్రామపంచాయతీ పరిధిలోని కొప్పుసూరు కాలనీలో గత కొంతకాలంగా కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామంలో సీసీ రోడ్డుపై పూర్తిగా నీళ్లు నిలవడం తో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ మడకం సుభద్ర, పంచాయతీ కార్యదర్శి గడ్డం కార్తీక్ ఆధ్వర్యంలో ఆ యొక్క సిసి రోడ్డు పై నిలిచిన నీటిని జేసీబీ సాయం తో సైడు కాల్వలు తీసినీటిని తొలగించారు. దీనితో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో భాగంగా స్థానిక వార్డు సభ్యులు నాగమణి కూడా పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ తగిలి పాడి ఆవు బలి..

### కన్నీరుమున్నీరవుతున్న రైతు..



**నవగీతం,భీంగల్** :భీంగల్ మండలంలోని ఎంజీ తండా గ్రామపంచాయతీ పరిధిలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పాడి రైతు బాణావత్ బుజ్జికి చెందిన ఆవు ప్రమాదవశాత్తు గ్రామంలోని విద్యుత్ నియంత్రిక (ట్రాన్స్‌ఫార్మర్)ను తాకడంతో శనివారం తీవ్ర విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది.కంటికి రెప్పలా చూసుకుంటున్న పాడి ఆవు కళ్లముందే మృతి చెందడంతో సదరు రైతు కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. కేవలం 15 రోజుల క్రితమే ఈ ఆవు ఒక దూడకు జన్మనిచ్చిందని, ఇప్పుడు తల్లి లేక అల్లాడుతున్న ఆ చిన్న దూడను చూసి గ్రామస్తులు సైతం చలించిపోయారు.ఈ ప్రమాదంపై స్థానికులు పశువైద్యాధికారికి సమాచారం అందించగా, భీంగల్ పశువైద్య కార్యాలయం నుంచి సహాయకుడు సంతోష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం పంచనామా నిర్వహించి పూర్తి వివరాలను నమోదు చేసుకున్నారు."మృతి చెందిన ఆవు విలువ సుమారు రూ. 50,000 వరకు ఉంటుంది. కుటుంబ పోషణకు ఆధారమైన ఆవు చనిపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పరిహారం అందించి న్యాయం చేయాలని బాధితురాలు బుజ్జి ప్రభుత్వాన్ని కోరారు.గ్రామాల్లో ప్రమాదకరంగా మారిన విద్యుత్ నియంత్రికల వద్ద రక్షణ తీగలు లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని తండావాసులు కోరుతున్నారు.

## భీంగల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ ముమ్మరం..

### అదనపు కలెక్టర్ సమీక్ష.

### త్వరలో 2 వేల పెండింగ్ ఓట్ల నమోదు పూర్తి



**నవగీతం, భీంగల్:** భీంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ ప్రక్రియను అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిపై అధికారులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమై పలు సూచనలు, సలహాలు అందించారు.

కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్ కుమార్, ఉప తహసీల్దార్ శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. భీంగల్ మండలంలో సుమారు 2 వేల ఓట్లకు సంబంధించిన నమోదు, అనుబంధ ఫారాల పరిశీలన ప్రక్రియ ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. అధికారులు మాట్లాడుతూ, రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్ఓలు (బూత్ లెవల్ అధికారులు) మరియు రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు కూడా అవసరమైన పత్రాలతో సహకరించి ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## తెలంగాణకు భారీగా రియల్ ఆదాయం

**హైదరాబాద్ :** భారతదేశంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న రియల్ ఎస్టేట్ మార్కెట్లలో హైదరాబాద్ తన అగ్రస్థానాన్ని మరోసారి నిలబెట్టుకుంది. 2026 ఏడాది మొదటి అర్ధభాగంలో నగరంలో ఇళ్లు, ప్లాట్ల కొనుగోళ్లు ఊహించని రీతిలో పుంజుకున్నాయి. తాజా గణాంకాల ప్రకారం.. ఈ ఆరు నెలల కాలంలో హైదరాబాద్ వ్యాప్తంగా మొత్తం 37,992 ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన 36,213 రిజిస్ట్రేషన్లతో పోలిస్తే ఇది గణనీయమైన వృద్ధిని సూచిస్తోంది. ఐటీ రంగ విస్తరణ, మౌలిక వసతుల కల్పన వంటి సానుకూల అంశాలు నగర రియాల్టీకి మరింత బూస్ట్ ఇచ్చాయి.ఈ రిజిస్ట్రేషన్ల జోరుతో తెలంగాణ రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. గత ఆరు నెలల్లో రియల్ ఎస్టేట్ రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఏకంగా 4,118 కోట్ల ఆదాయం లభించింది. గత ఏడాది వసూలైన రాబడితో పోలిస్తే ఇది ఏకంగా 52 శాతం అద్భుతమైన వృద్ధిని నమోదు చేయడం విశేషం. జూన్ నెలలో ప్రభుత్వం భూముల ప్రభుత్వ విలువల సవరణ చేపట్టబోతుందనే ముందస్తు అంచనాలతో, మే నెలలోనే అత్యధిక సంఖ్యలో కొనుగోలుదారులు తమ

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీకి ఆహ్వానం

-మొదటిపేజీ తరువాయి

ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడిని ప్రధాని పరిచయం చేసిన సీఎం ఈయనే స్థానిక ఎంపీ అని చెప్పారు. అప్పలనాయుడు తనకు తెలుసని ఆయన రోజూ సైకిల్‌పై పార్లమెంట్‌కు వస్తారని ప్రధాని చెప్పారు. తాజా రాజకీయ పరిస్థితులపైనా ప్రధాని, సీఎం మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గంగా, కావేరి నదుల అనుసంధానంపైనా మోదీ, చంద్రబాబు చర్చించినట్లు సమాచారం. సీఎంతో పాటు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, ఎంపీలు శ్రీకృష్ణదేవరాయలు, అప్పలనాయుడు ప్రదానిని కలిశారు.

**పోలవరం, జల్‌జీవన్ మిషన్‌పై చర్చ:**

కేంద్రమంత్రి సీఆర్.పాటిల్‌తోనూ చంద్రబాబు సమావేశమయ్యారు. పోలవరం, జల్‌జీవన్ మిషన్‌పై ఇరువురు చర్చించారు. పోలవరం సందర్శనకు రావాలని సీఎం పాటిల్‌ను కోరారు. ప్రాజెక్ట్ వర్క్ స్టాప్ ఆర్డర్‌ను పూర్తిగా ఎత్తివేసేలా చూడాలని సీఎం కోరారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో ముంపు ప్రాంతాల సమస్యను పరిష్కరించాలని అన్నారు. పోలవరం – నల్లమల సాగర్ ప్రాజెక్ట్ ప్రతిపాదనల పురోగతిపై చర్చించారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానంపైనా ఇరువురి మధ్య చర్చ జరిగింది. పోలవరం–బనకచర్ల వల్లే కావేరి అనుసంధానం ఆలోచన వచ్చిందని కేంద్ర అధికారులు చెప్పారు.

బనకచర్ల–కావేరి అనుసంధానంతో ఉపయోగం ఉంటుందని అన్నారు. సముద్రంలోకి వృథాగా పోయే నీటిని వాడుకోవడం మంచిదని సీఎం అన్నారు. గోదావరి నుంచి శ్రీశైలానికి తెస్తే మహారాష్ట్ర వాటా అడుగుతుందేమోనని అధికారులు అడగ్గా నీటిని అందరూ సమానంగా తీసుకుంటే నష్టం ఏముందని సీఎం అన్నారు. శ్రీశైలం నుంచి గ్రావిటీతోనే కావేరికి నీళ్లు చేరుకుంటాయని స్పష్టం చేశారు. గ్రావిటీతో చేరుకుంటే ఖర్చు కూడా బాగా తగ్గుతుందని పాటిల్ అన్నారు. శ్రీశైలం నుంచి కాకుంటే బనకచర్ల నుంచి అనుసంధానించడంపై చర్చించాలని సీఎం సూచించారు. అయితే శ్రీశైలం కంటే బనకచర్ల నుంచే తమకు సులువని జలశక్తి శాఖ అధికారులు బదులిచ్చారు. పోలవరం ప్రాజెక్టు త్వరలోనే పూర్తవుతుందన్న సీఎం గోదావరి–కావేరి అనుసంధానంలో భారం తగ్గుతుందని చెప్పారు.

**భాగస్వామ్య పక్షాలతో ప్రత్యేక భేటీ**

పోలవరం కాలువను శ్రీకాకుళం వరకు తీసుకెళ్లడాన్ని పరిశీలించాలని సీఎం సీఆర్ పాటిల్‌ను కోరారు. మహానది–వంశధార అనుసంధానంలో శ్రీకాకుళం ఉంటుందని కేంద్ర అధికారులు బదులిచ్చారు. గోదావరి–కావేరి అనుసంధానంపై మిగతా రాష్ట్రాలనూ ఒప్పించాలని సీఎం కోరారు. భాగస్వామ్య రాష్ట్రాల సీఎంలతో భేటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్న పాటిల్ 3 వారాల్లోనే సమావేశం ఏర్పాటుకు ప్రయత్నం చేస్తామని చెప్పారు. సముద్రంలోకి నీరు వృథాగా పోవడం కంటే ఉపయోగించుకుంటే మంచిదన్న సీఎం ఈ అంశంపై జలశక్తి శాఖ ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాలు, భాగస్వామ్య పక్షాలతో ప్రత్యేక భేటీ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రాల ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యమన్నారు. చంద్రబాబు చేసిన అన్ని రాష్ట్రాలతో భేటీ ప్రతిపాదనను పాటిల్ అంగీకరించారు. కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, మనోహర్ లాల్ ఖట్టర్‌తోనూ సీఎం విడివిడిగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై పీయూష్ గోయల్‌కు వినతులు అందించారు. మనోహర్ లాల్ ఖట్టర్‌తో సీఎం భేటీలో రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.

## మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్ట్

-మొదటిపేజీ తరువాయి

కుమారుడు ఆరవ్ వర్మ ద్విచక్ర వాహనం నడుపుతూ రోడ్డు ప్రమాదానికి గురి చేశాడు. ఆరవ్ వర్మ నడుపుతున్న బైక్ ఢీకొని దానయ్య అనే గొర్రెల కాపరి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ యాక్సిడెంట్ కేసులో తన కుమారుడిని రక్షించుకునేందుకు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు తన పలుకుబడితో పెద్ద కుట్ర పన్నారు. పోలీసుల విచారణను పూర్తిగా తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు.

**కొడుకుకు బదులుగా మరొకరిని**

ఈ కేసు నుంచి ఆరవ్ వర్మను చాకచక్యంగా తప్పించారు. తన కొడుకుకు బదులుగా సిద్ధార్థ త్యాడి అనే మరో అమాయక యువకుడిని బలిపశువును చేశారు. యాక్సిడెంట్ చేసింది సిద్ధార్థ త్యాడి అని నమ్మించి, అతడిని జైలుకు పంపాలని చూశారు. అంతేకాకుండా, ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనాన్ని కూడా పోలీసులకు దొరకకుండా దాచేశారు. పోలీసులకు చిక్కకుండా నేరాన్ని కప్పిపుచ్చేందుకు సాక్ష్యాలను మాయం చేశారు.

**కటకటాల వెనక్కి**

మృతుడు దానయ్య కుటుంబాన్ని సైతం సీదిరి అప్పలరాజు ప్రలోభాలకు గురి చేశారు. డబ్బులు, ఉద్యోగం ఆశ చూపి కేసును మూసివేసేందుకు ప్రయత్నించారు. ఈ వ్యవహారం అంతా పోలీసుల దర్యాప్తులో బట్టబయలు కావడంతో పోలీసులు తీవ్రంగా పరిగణించారు. సాక్ష్యాధారాలు తారుమారు చేయడం, నేరాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం, బాధిత కుటుంబాన్ని ప్రలోభపెట్టడం వంటి అభియోగాలపై అప్పలరాజుపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే ఆయనను అరెస్టు చేసి తీసుకెళ్లారు. కాగా, రోడ్డు ప్రమాదానికి కారణమైన సీదిరి కుమారుడు ఆరవ్ వర్మ ఇప్పటికే రిమాండ్‌లో ఉన్నాడు.

## 22-ఏ నిబంధన సరళీకృతం చేస్తూ కొత్త జీవో

-మొదటిపేజీ తరువాయి




రైతులు, సామాన్య ప్రజలు తమ భూములు విక్రయించడానికి, తనఖా పెట్టుకోవడానికి, బదిలీ చేసేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడమే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి వెల్లడించారు. సీలింగ్ భూములు అన్యాక్రాంతం కాకుండా 22ఏ నిబంధనలు ఉంటాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. '22ఏ నిర్వహణ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ పరిధిలో ఉంటుంది. వ్యవసాయ భూములకు వెబ్ ల్యాండ్ మాత్రమే ఉంటుంది. ఏ విధమైన మాన్యువల్ ఎంట్రీలు ఉండవు. గ్రామకంఠం, పట్టా భూములను నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చకూడదు. 18.06.1954 కంటే ముందు అసైన్ చేసిన అన్ని భూములు నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగిస్తున్నాం. కొత్త ఉత్తర్వులు జారీ అయిన 90రోజుల్లోపు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు ఐజీఆర్ఎస్, సీసీఎల్ఏ చేయాలి. తన భూమి ప్రభుత్వ భూమి కాదని నిరూపించుకోవాల్సిన బాధ్యత పౌరులపైన, భూ యజమానులపైన ఉంది.'

**30 రోజుల గడువుతో నోటీసు**

దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఏ అధికారి చర్య కారణంగా భూ యజమాని హక్కులకు భంగం కలిగితే దానికి ఆ అధికారినే బాధ్యుడుగా భావించి తదుపరి చర్యలు తీసుకుంటారని తెలిపారు. 22ఎ జాబితాలో పెట్టాలని ప్రతిపాదించిన ప్రతి ఫైల్?కు సంబంధించిన సమాచారం, ఆ ఫైల్? ఎక్కడుంది, ఆ ఫైల్? పరిస్థితి ఏంటి అనేది తెలుసుకునే అవకాశం ప్రజలకు ఉండేలా పబ్లిక్? ఇన్?క్లూజన్? రిజిస్టర్?ను కూడా ఐజీఆర్ఎస్ నిర్వహిస్తుందని తెలిపారు. ఏదైనా భూమి వెనువెంటనే అన్యాక్రాంతం కాబోతుందనే సమాచారం ఉండి దానిని ఎమర్జెన్సీగా 22ఎ జాబితాలో పెట్టాలంటే 60 రోజుల్లోపే పూర్తి చేయాలని తెలిపారు. ఈ లోపు సంబంధిత పౌరుడికి 30 రోజుల గడువుతో నోటీసు ఇవ్వాలని

## కొడిమ్యాలలో బోయినపల్లి వినోద్ కుమార్ పుట్టినరోజు వేడుకలు




**నవగీతం,కొడిమ్యాల.** కొడిమ్యాల మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు పులి వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా "లాంగ్ లివ్ వినోద్ అన్న" అంటూ నినాదాలు చేశారు. అనంతరం పులి వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, కరీంనగర్ అభివృద్ధికి విశేష కృషి చేసిన మాజీ ఎంపీ, తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని, భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొత్తూరి స్వామి, రైతుబంధు మాజీ అధ్యక్షుడు అంకం రాజేశం, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గడ్డం చంద్రమోహన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బైరి వెంకటి, నాయకులు దోమకొండ నరసయ్య, నేరెళ్ల రాజయ్య, మొగిలిపాలెం శ్రీనివాస్, చెల్లా లక్ష్మణ్, సుంకె నరేష్, మోహన్, ఇంతియాజ్, ఈసంపల్లి రమేష్, మార్గం వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'నేను సైతం" కార్యక్రమంలో భాగంగా సీసీటీవీ కెమెరాల జియో ట్యాగింగ్

**సైబరాబాద్ సీపీ సమీక్ష**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా సీసీటీవీ కెమెరాల జియో ట్యాగింగ్, పర్యవేక్షణ, నిర్వహణ, విస్తరణపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, అధ్యక్షతన బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయ ఆడిటోరియంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర తో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, నేరాల దర్యాప్తు, కీలక సమాచార సేకరణలో సీసీటీవీ కెమెరాలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. కమిషనరేట్ పరిధిలో ఇప్పటికే ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలన్నింటినీ జియో ట్యాగింగ్ చేసి వాటి వివరాలను డిజిటల్ డేటాబేస్‌లో నమోదు చేయాలని, కొత్తగా ఏర్పాటు చేసే ప్రతి కెమెరాను కూడా వెంటనే జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో సీసీటీవీ వ్యవస్థ పర్యవేక్షణ కోసం ప్రత్యేక అడ్మిన్‌ను నియమించి, కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు. పనిచేయని కెమెరాలను వెంటనే మరమ్మతులు చేయించి, ఇప్పటికే ఉన్న కెమెరాలను పోలీసు పర్యవేక్షణ వ్యవస్థతో అనుసంధానం చేయాలని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో "నేను సైతం" కార్యక్రమం ద్వారా మరిన్ని సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా, చాలా చోట్ల మరుగున పడిన డీవీఆర్ (ఆఎఖీ) ఆధారిత సీసీటీవీ వ్యవస్థలను ఆధునిక ఎన్‌వీఆర్ (ఔఎఖీ) సాంకేతికతకు అప్‌గ్రేడ్ చేసే అంశంపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. కమిషనరేట్ వ్యాప్తంగా డీవీఆర్ వ్యవస్థలను దశలవారీగా ఎన్‌వీఆర్ విధానానికి మార్చేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన సాంకేతిక అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, పోలీస్ స్టేషన్ల నుంచి ప్రధాన కంట్రోల్ సెంటర్ వరకు నెట్‌వర్క్ అనుసంధాన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలోని సీసీటీవీ నెట్‌వర్క్‌ను సెంట్రల్ కంట్రోల్ వ్యవస్థతో అనుసంధానం చేయడం ద్వారా ప్రత్యక్ష పర్యవేక్షణ, వీడియో రికార్డింగ్, ఫుటేజీ నిల్వ, అవసరమైన సమయంలో ఆధారాల సేకరణ, విశ్లేషణ మరింత వేగంగా, సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసిన వెండర్లు కెమెరాల నిర్వహణ, సాంకేతిక లోపాల పరిష్కారం, సేవల నిరంతర అందుబాటుపై పూర్తి బాధ్యత వహించాలని సీపీ స్పష్టం చేశారు. జియో ట్యాగింగ్ ప్రక్రియ, సాఫ్ట్‌వేర్ వినియోగం, కెమెరాల నిర్వహణపై అధికారులు, సిబ్బంది, వెండర్లకు ప్రత్యేక శిక్షణ, ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించాలని సూచించారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ సీసీటీవీ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడం ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు, నేరాల దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచి ప్రజలకు మరింత మెరుగైన భద్రతను అందించవచ్చని డా. ఎం. రమేష్ తెలిపారు. సీసీటీవీ కెమెరాల జియో ట్యాగింగ్, సెంట్రల్ మానిటరింగ్, డీవీఆర్ నుంచి ఎన్‌వీఆర్ వ్యవస్థకు మార్పు ద్వారా నేరాలపై మరింత సమర్థవంతమైన పర్యవేక్షణ సాధ్యమవుతుందని, తద్వారా నేరాలు గణనీయంగా తగ్గుముఖం పడతాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో "నేను సైతం" కార్యక్రమాన్ని మరింత విస్తరించి, నివాస గృహాలు, అపార్ట్‌మెంట్లు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, విద్యాసంస్థల్లో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీసులతో అనుసంధానం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల సహకారం, ఆధునిక సాంకేతికత కలిసివస్తే సైబరాబాద్ కమిషనరేట్‌ను మరింత సురక్షితమైన ప్రాంతంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని కమిషనర్ పేర్కొన్నారు.

## పసిడి ధరకు మళ్లీ రెక్కలు.. రూ.1.50 లక్షలకు చేరువలో తులం రేటు



**న్యూఢిల్లీ :** బంగారం ధరలు మళ్లీ రెక్కలు తొడుగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఒక్కసా రిగా డిమాండ్ నెలకొనడం, దేశీ యంగా కొనుగోళ్లు పెరు గడం తో బంగారం విలువ రూ.1.50 లక్షలకు చేరువైంది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రా ముల గోల్డ్ ధర రూ.1,900 ఎగబాకి రెండు వారాల గరిష్ఠ స్థాయి రూ.1,49,600కి చేరుకున్నట్టు ట్రేడర్లు తెలిపారు. అంతకుముందు రూ.1, 47,700గా ఉన్నది. ఈ నెల 7న గోల్డ్ ధర రూ.1,49, 250 తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి.

**వెండి పరుగులు**

గత ఆరు రోజులుగా తగ్గుతూ వచ్చిన కిలో వెండి ఏకంగా రూ.8,500 ఎగబాకి రూ.2.30 లక్షలకు చేరుకున్నది. గత సెషన్‌లో వెండి రూ.2,21,500గా ఉన్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో వెండి భారీగా పుంజుకున్నదని ట్రేడర్లు వెల్లడించారు. రూపాయి పతనం కావడం కూడా పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్ మెరుగుపడిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 47.43 డాలర్లు లేదా 1.16 శాతం ఎగబాకి 4,125.24 డాలర్లకు చేరుకోగా, వెండి 59.42 డాలర్లు పలికింది. వచ్చే సమీక్షలో వడ్డీరేట్లను పెంచే అవకాశాలను పరిశీలించనున్నట్టు అమెరికా ఫెడరల్ రిజర్వు ప్రకటించడంతో మదుపర్లలో ఉత్సాహాన్ని నింపింది.

## భూభారతి రి సర్వే అవగాహన సదస్సు



**నవగీతం, రాయికల్ ప్రతినిధి:** రాయికల్ మండలం చింతలూరు గ్రామంలో సర్పంచ్ బానోతు వనిత అధ్యక్షతన జరిగిన భూభారతి భూ సర్వే అవగాహన సదస్సుకు ఎమ్మార్వో నాగార్జున ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు భూ సమస్యలపై అవగాహన కల్పించారు రీ సర్వేలో భాగంగా సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండి భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు గ్రామ సర్పంచ్ బానోత్ వనిత మాట్లాడుతూ రైతులు భూ సమస్యలను తమ దృష్టికి తేవాలని అట్టి సమస్యలను రెవెన్యూ అధికారుల సహాయంతో సర్వే నిర్వహించి పరిష్కరించబడతాయని ఇంత చక్కటి అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులను కోరారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్లపు నరసయ్య ఆర్ ఐ పద్మయ్య జిపిఓ నర్సయ్య పంచాయతీ కార్యదర్శి రవీంద్ర రెడ్డి వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## హకీంపేట క్రీడా పాఠశాలలో ఉచిత సీటు సంపాదించిన విజ్ డమ్ విద్యార్థి



**నవగీతం రాయికల్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహించే తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ లో విస్డం స్కూల్ రాయికల్ చెందిన 3వ తరగతి విద్యార్థి సమ్మెట విరాట్ పోరుమల్ల వాస్తవ్యుడు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ లో 4 వ తరగతి లో ప్రవేశం పొందాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి మాట్లాడుతూ స్పోర్ట్స్ స్కూల్లో సీటు సంపాదించిన విద్యార్థులకు నాలుగవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్య భోజనం వసతితో పాటు ఉచిత శిక్షణ కూడా ఉంటాయన్నారు. ప్రతి సంవత్సరం మా విద్యార్థులు క్రీడల్లో రాష్ట్ర స్థాయి లో రాణిస్తూ పాఠశాలకు మరియు తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకువస్తున్నారని, పోటీల్లో పాల్గొనాలంటే పాఠశాల తో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా అవసరం అని, ఇక ముందు కూడా క్రీడల్లో ప్రతిభ చూపే విద్యార్థులకు పాఠశాల నుండి ప్రత్యేక శిక్షణ, ప్రోత్సాహం ఉంటాయని అన్నారు. ఉచిత సీటు సంపాదించిన విద్యార్థి విరాట్ ను పాఠశాల కరస్పాండెంట్ ఏ.ఎం రాజురెడ్డి డైరెక్టర్ నివేదిత రెడ్డి లు అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పి ఈ టి లు రవీష్ రెడ్డి, సునీత విద్యార్థి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బిఎల్ వో ల పాత్ర అభినందనీయం




**నవగీతం రాయికల్ ప్రతినిధి:** రాయికల్ మండలం కొత్తపేట గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 12,14 బిఎల్ వో లు మాద సుజాత, అల్లే అనురాధ ఎన్నికల సంఘం చేపట్టిన ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తిచేసిన సందర్భంగా వారిని బుధవారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ పద్మయ్య, గ్రామ సర్పంచ్ మీనుగు గంగు–అంజయ్య లు శాలువాలతో ఘనంగా సన్మానించి రూ. 2000 ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావం, సమయపాలన, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ఇంటింటికి వెళ్లి అర్హులైన ఓటర్ల వివరాలు సేకరించి, అవసరమైన పత్రాలు పరిశీలించి ఓటర్ జాబితా సవరణలో 100 శాతం పూర్తి చేయడం అభినందనీయమన్నారు. మిగతా బిఎల్వోలు వీరిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తునికి రంజిత్, పంచాయతీ కార్యదర్శి రాజేష్, జిపివో దశ కుమార్, కారోబార్ రమేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి భూసర్వే--రీసర్వేపై చెప్యాల గ్రామంలో అవగాహన సదస్సు




**నవగీతం,కొడిమ్యాల** కొడిమ్యాల మండలంలోని చెప్యాల గ్రామాన్ని భూభారతి భూసర్వే, రీసర్వే కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల భూ సంబంధిత సందేహాలను నివృత్తి చేశారు. ఆధునిక సాంకేతికతతో జియో కోఆర్డినేట్స్ ఆధారంగా భూముల నిర్ధిష్ట హద్దులను నిర్ణయించి, ప్రతి రైతుకు ఎల్‌పీఎం మ్యాపులు రూపొందించడం ద్వారా గ్రామంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. భూసర్వే, రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి రైతులు, గ్రామస్థులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో స్వరూప, గ్రామ సర్పంచ్ శ్రీలత, మండల సర్వేయర్ తిరుపతి, గిర్దావర్ తిరుపతి, ఉప సర్పంచ్ జిడిగె సాయికుమార్ గ్రామ పాలనాధికారి పద్మ, గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
23 జూలై 2026



# గేటెడ్ కమ్యూనిటీలో లవ్

ఒక గేటెడ్ కమ్యూనిటీలో జరిగే రొమాంటిక్ థ్రిల్లర్ కథతో రూపొందిన చిత్రం 'అదే నీవు అదే నేను'. కొండల్ దర్శకత్వంలో గోవిందు కాంద్రేగుల నిర్మించారు. 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో రెండు విభాగాల్లో అవార్డులు సాధించిన 'కమిటీ కుర్రోళ్లు'లో నటించిన త్రినాథ్ వర్మ, యశ్వంత్ పెండ్యాల, 'సిద్ధార్థ్ రాయ్' సినిమా ఫేమ్ తన్వీ నేగి, సహర్ కృష్ణన్ హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రాన్ని ఈ నెల 31న విడుదల చేయనున్నట్లు బుధవారం చిత్రబృందం ప్రకటించింది. "మంచి రొమాంటిక్ థ్రిల్లర్ కథాంశంతో కొండల్ తెరకెక్కించిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది" అని నిర్మాత పేర్కొన్నారు.

# తెలంగాణ గ్రామీణ కథ

తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో రూపొందిస్తున్న యాక్షన్ డ్రామా 'మారెమ్మ'. ఈ సినిమా ద్వారా రవితేజ సోదరుడి తనయుడు.. మాధవ్ హీరోగా పరిచయమవుతున్నాడు. మంచాల నాగరాజ్ దర్శకుడు. సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. +వశీస్త్రతీఖజూస్త్రఱవ =వటవతీవఅవెవ ఇందులో మాధవ్ యాక్షన్‌మోడ్‌లో కనిపిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను ఆవిష్కరిస్తూ బలమైన భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, యాక్షన్ ఘట్టాలు హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. దీపా బాలు, వినోద్‌కుమార్, వికాస్ వశిష్ట తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రశాంత్ ఆర్ విహారి, నిర్మాత: మయూర్ రెడ్డి, దర్శకత్వం: మంచాల నాగరాజ్.



# ముచ్చటగా మూడోసారి?





అగ్ర కథానాయిక పూజాహెగ్డే తెలుగులో పూర్వవైభవం కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నది. ప్రస్తుతం తెలుగులో దుల్కర్‌సల్మాన్‌తో కలిసి ఓ సినిమాలో నటిస్తున్నదీ భామ. శర్వానంద్ 'జార్జ్‌క్రిష్' చిత్రంలో ఆమెనే కథానాయిక అని ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో పూజాహెగ్డే టాలీవుడ్‌లో మరో భారీ ఆఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. అగ్ర హీరో అల్లు అర్జున్‌తో ఈ సొగసరి ముచ్చటగా మూడోసారి జోడీకట్టబోతున్నదని వార్తలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం అల్లు అర్జున్ సైన్స్ ఫిక్షన్ 'రాకా'లో నటిస్తున్నారు. అట్లీ దర్శకుడు. ఈ సినిమా పూర్తయిన తర్వాత లోకేష్ కనకరాజ్ డైరెక్షన్‌లో బన్నీ సినిమా కన్‌ఫర్మ్ అయిన విషయం తెలిసిందే. ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన కూడా వెలువడింది. ఇందులో పూజాహెగ్డే కథానాయికగా ఖరారయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఫిల్మ్‌నగర్ టాక్. గతంలో అల్లు అర్జున్-పూజాహెగ్డే జోడీ 'డీజే' 'అల వైకుంఠపురములో' వంటి హిట్ చిత్రాల్లో కలిసి నటించారు.

# చెన్నైతో ఉన్న అనుబంధం గుర్తుకొచ్చింది



'ఈ సినిమా టైటిల్ వినగానే నేనొక్కసారిగా ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లిపోయాను. చెన్నైతో నాకున్న అనుబంధం, ప్రేమ గుర్తుకొచ్చింది. నిజంగా ఈ టైటిల్‌లో ఏదో మ్యాజిక్ ఉంది. నన్ను స్ఫూర్తిగా తీసుకొని అభిమానులు ప్రయోజకులు అయితే అంతకుమించిన ఆనందం ఉండదు. ఈరోజు వేదిక మీద అందరూ నా అభిమానులు ఉండటం సంతోషంగా ఉంది' అన్నారు మెగాస్టార్ చిరంజీవి. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన 'చెన్నై లవ్‌స్టోరీ' చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కిరణ్ అబ్బవరం, శ్రీగౌరిప్రియ జంటగా నటించిన ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకుడు. ఎస్‌కేఎన్, సాయిరాజేష్ నిర్మాతలు. ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'ఈ చిత్ర నిర్మాత ఎస్‌కేఎన్ నా అభిమానిగా హైదరాబాద్‌కు వచ్చి.. సినిమాల మీద ప్రేమతో నిర్మాతగా ఎదిగారు. ఇక సాయిరాజేష్ మంచి సినిమాలు తీయడమే కాకుండా నేషనల్ అవార్డ్ పొందడం ఆనందంగా ఉంది. నిజంగా ఇలాంటి అభిమానుల్ని చూసి గర్విస్తున్నా. కిరణ్ అబ్బవరం మన పక్కింటి అబ్బాయిలా ఉంటాడు. నాలుగైదు సినిమాలతో మంచి క్రేజ్ సంపాదించుకున్నాడు' అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'చిరంజీవి అన్నది పేరు కాదు. అది నాకో ఎమోషన్. ఈ వేదికలో ఆయన ముందునిల్చొని మాట్లాడటం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా. ఈ సినిమాలో నేను పోషించిన స్టీవెన్ అనే పాత్ర నా వ్యక్తిగత జీవితానికి కూడా బాగా కనెక్ట్ అయింది' అని చెప్పారు. తన కెరీర్‌లోనే బెస్ట్ పాత్రను పోషించానని కథానాయిక శ్రీగౌరీప్రియ ఆనందం వ్యక్తం చేసింది

# కల్యాణ్‌రామ్ కొత్త సినిమా



ప్రస్తుతం వెంకటేష్‌తో కలిసి ఓ మల్టీస్టారర్ సినిమాలో నటిస్తున్నారు కల్యాణ్‌రామ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటున్నది. ఇదిలావుండగా కల్యాణ్‌రామ్ మరో సినిమాకు ఓకే చెప్పారని తెలిసింది. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు తెరకెక్కించబోతున్న ఈ చిత్రానికి పరశు రామ్ దర్శకత్వం వహిస్తారని సమాచారం. 'ఫ్యామిలీ స్టార్' పరాజయంతో దర్శకుడు పరశురామ్ కెరీర్‌కు కాస్త బ్రేక్‌నిచ్చారు. తన తదుపరి ప్రాజెక్ట్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఓ యూనిక్ పాయింట్‌తో కథను సిద్ధం చేశారని తెలిసింది. దీనిని కల్యాణ్‌రామ్‌కి వినిపించగా ఆయన సానుకూలంగా స్పందించారని ఫిల్మ్‌నగర్ టాక్ వినిపిస్తున్నది. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.